స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచిక

# ఐక్య ఉపాధ్యాయ

సంపుటి 4 ★ సంచిక 8 ★ ఆగస్టు 1978




రు. 1

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

# పాఠకుల అభిప్రాయాలు

జులై పత్రిక కార్టూన్ ప్రభుత్వ పాలసీకి ప్రతిబింబంగా వేసినందుకు సంపాదక వర్గానికి, చిత్రకారునికి ధన్యవాదాలు.

కె. చిన్నారావు, నెల్లిపాక.

జులై ముఖచిత్రం, సంపాదకీయం సందర్భోచితంగా ఉన్నవి. ఇకనైనా ఎయిడెడ్ మేనేజిమెంట్లకు కనువిప్పుకలుగుతుందా? జీవకోటిలో ఉత్కృష్ట జన్మ ఎత్తిన మనిషియొక్క కర్తవ్యమేమిటి? అని నిలదీసి ప్రశ్నిస్తూ వ్రాసిన గేయం (నేను మనిషిని!) చాలా బాగుంది. వ్యంగ్యరచన సీరియల్ అభినవ నీతిచంద్రిక ప్రస్తుత పరిస్థితులకు దర్పణం లాంటిది. కమ్యూటేషన్ పెన్షన్ నియమ నిబంధనలు శ్రీ యస్. వి. బసవయ్య చక్కగా వివరించారు. మొత్తంపై జులై సంచిక చాలా బాగుంది.

— యస్. విష్ణుమూర్తి యెల్లికల్.

ఐక్య ఉపాధ్యాయ పత్రిక చాల బాగుంటున్నది. ముఖ్యంగా అభినవ నీతి చంద్రిక ఒక పుస్తకంగా ప్రచురించిన బాగుంటుంది.

— డి. మహీధర్, హైద్రాబాద్.

జులై సంచిక కార్టూన్ బాగుంది. పత్రిక రెండవ వారంలో అందిస్తే బాగుంటుంది. — గ్రంధి వెంకటరావు, భీమవరం.

# సంపాదక లేఖలు

## కరుడుకట్టిన రెడ్ టేపిజంకు బలియౌతున్న ప్రభుత్వోపాధ్యాయులు

ఆర్యా!

ప్రభుత్వ పాఠశాలలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు దశాబ్దాలు గడచినా సర్వీసు రెగ్యులరైజేషన్ చేయక విపరీత కాలయాపన చేయుచున్నారు. ఇందు హయ్యర్గ్రేడు, సెకండ్రీగ్రేడు స్కూలు అసిస్టెంటులు, పండిట్స్. ఆర్ట్స, క్రాఫ్టు, మొ॥ అనేక కేటగిరి ఉపాధ్యాయులువున్నారు. వీరిలో కొందరికి 20 సంవత్సరముల సర్వీసువున్నా సర్వీసు రెగ్యులరైజేషన్ కాలేదంటే ఎంత ఆశ్చర్యకరమైన విషయమో ఆలోచించండి. ఈ బాపతు ఉపాధ్యాయులు తూ. గో. జిల్లాలోనే వందల కొలది వున్నారంటే రాష్ట్ర వ్యాప్తంగా వేలలో వుండవచ్చు.

పూర్తిఅర్హతకల్గి, సంతృప్తికరమైన సర్వీసు కల్గిన మాకు వెంటనే సర్వీసు రెగ్యులరైజేషన్ చేయించాలని పై అధికారులను [illegible]గా కోరినా, ఏవిధమైన చర్యగైకొనక నిర్లక్ష్యంచేస్తూ మమ్ము టెంపరరీ ఉపాధ్యాయులుగానే వుంచినందువల్ల, అనేక ఆర్థిక నష్టములకు గురిఅయి నిరాశా నిస్పృహలతో కాలం గడుపుచున్నాము. ఇలాగే రిటయిరయిపోతామేమోనని భయాందోళనలతో మానసికంగా కృశించిపోతున్నాము.

ఇప్పటికైనా ప్రభుత్వము మా మొర ఆలకించి, దశాబ్దాల తరబడి పేరుకుపోయిన మా సర్వీసు రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషను చేయించి, మా సమస్యలు పరిష్కరింపచేయ కోరుచున్నాను.

భవదీయులు

తూ. గో. జిల్లా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు.

## 21-1-76 తర్వాత ప్యాసయిన వారినికూడా అప్గ్రేడ్ చేయాలి

ప్రభుత్వం సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులను బి.యిడి. అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ చేస్తూ జి. ఓ. యం. యస్. నెం. 629 తేదీ 14-6-77 ద్వారాను, జి. ఓ. యం. యస్. నెం. 886 తేది 25-8-77 ద్వారాను ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు 21-1-76 కు పూర్వం ఉత్తీర్ణులైనవారికి మాత్రమే అన్వయించునట్లు ఉన్నాయి. దీనితో అతర్వాత పాసయినవారికి తీరని ఆశాభంగం ఎదురయింది. కష్టపడి, అనేక వ్యయప్రయాసలకోర్చి స్థాయిని పెంచుకొన్నవారికి ప్రోత్సాహం కల్గించాల్సిందిపోయి ఇది అసలు లక్ష్యాన్నే దెబ్బతీసేదిగా వుంది. 76 తర్వాత ప్యాసయిన వారిలో 10 సం॥ల పైబడి సర్వీసుగలవారున్నారు. వారు సంవత్సరమంతా రెగ్యులర్గా బి.ఇడి. శిక్షణపొంది, వేలరూపాయలు ఖర్చుపెట్టకొన్నారు. కాన ప్రభుత్వం విచక్షణమాని ఆ తేదీ తర్వాత ప్యాసయిన వారికికూడా ఆ జి. ఓ. అన్వయింపజేయ గోరుతున్నాను.

—యం. శేషాచలపతి, చెర్లోపల్లి అప్ వాయల్పాడు.

## పాఠ్య గ్రంథాలు - సూచనలు

పాఠ్యగ్రంథాలు ఏ ప్రమాణాలమీద, ఏ లక్ష్యాన్ని ఆశించి విద్యాశాఖవారు నిర్ణయిస్తున్నారో అర్థంగాదు ప్రస్తుతమున్న పాఠ్యగ్రంథాల్లో ముఖ్యంగా తెలుగు పాఠ్యాంశాల్లో చాలాభాగం పుక్కిటి పురాణాలకు చెందినవి. ప్రయోజన శూన్యమైనవి. హేతువాదానికి విలువని అవాస్తవికమైనవి.

కాని కారుచీకట్లో కాంతిరేఖలా నలభై సంవత్సరాల క్రితం మన సమకాలికులైన డా॥ నార్మన్బెతూన్ గురించిన పుస్తకం తొమ్మిదవ తరగతి పిల్లలకు ఉపవాచకంగా నిర్ణయింపబడటంఎంతో ముదావహం. ఆ గ్రంథ పఠనంవల్ల పిల్లల్లో లక్ష్యశుద్ధి యేర్పడటమే గాకుండా సేవాభావం, తోటి మానవుడియెడ మన కర్తవ్యం హృదయంలో హత్తుకొంటాయి. డా॥ బెతూన్ "రోగగ్రస్తుడు నీదగ్గరకు రావటంగాదు. నీవే అతని దగ్గరికి వెళ్లాలి!" అని చేసిన వినాదం భావిజీవితాల్ని లక్ష్యశుద్ధి గలవిగా చేస్తుంది. అలాగే ఇంగ్లీషులో కూడ బొమ్మల్లో సహా బెతూన్ జీవితం ప్రచురింపబడింది దాన్ని కూడ క్రింది తరగతుల పిల్లలకు ఆంగ్ల ఉపవాచకంగా నిర్ణయించాలి. అంతేగాక ఆ తరహాకి చెందిన డా॥ కోట్నీస్ మొదలగు వారి జీవితాలు పిల్లలకు అర్థమయ్యే భాషలో బొమ్మల్లో ప్రచురించి అవి కూడ పాఠ్యగ్రంథాలుగా చేయాలని విద్యాశాఖ వారిని కోరుతున్నాను.

మోతుకూరి వీరయ్య, ఖమ్మం.

(మిగతా 3 వ కవరు పేజీలో)

IKYA UPADHYAYA

Life Subscription 116-00
Yearly ,, 10-00
Single Copy 1-00

Ikya Upadhyaya
Akulavari Street,
Vijayawada-2
520002

# ఐక్య ఉపాధ్యాయ

సంపాదకవర్గం:
మైనేని వెంకటరత్నం
(ప్రధాన సంపాదకుడు)
నాదెళ్ళ సీతారామాచారి
కోడూరు నారాయణరావు
అప్పారి వెంకటస్వామి
మోతుకూరు నరహరి

సంపుటి 4 ఆగస్టు 1978 సంచిక 8

# చలో హైదరాబాద్!

బజారున పడాలని, వీధుల్లోకివచ్చి ప్రదర్శనలు జరపాలని ఎవరికీ వుండదు. కాని వివక్ష పూరితమైన ప్రభుత్వ విధానాలు, విద్యారంగంలో కీలకపాత్ర వహించే ఉపాధ్యాయుల్ని బలవంతాన బజారుకు నెట్టుతున్నయ్. తమ విధి నిర్వహణను సక్రమంగా సాగింపలేని క్లిష్టపరిస్థితుల్ని కల్పిస్తున్నాయ్. వారిబ్రతుకుల్ని సుడి గుండాల్లోకి ఈడుస్తున్నాయ్.

అందుకే ఈ ఆందోళన. తమ కోర్కెల్ని సాధించే, హక్కుల్ని నిలబెట్టుకొనే సంఘటిత శక్తిని నిరూపించే ప్రదర్శన అదే చలో హైదరాబాద్ :

ఎయిడెడ్ టీచర్లకు రక్షణ కల్పిస్తుందనుకొంటున్న విద్యా బిల్లు ఇంకా చట్టంకాలేదు. స్వార్థపరవర్గాల వత్తిడివల్ల సంవత్స రాలకు సంవత్సరాలు వాయిదా వేయబడుతూనే ఉంది.

నరెండర్ లీవు జి. ఓ. ప్రభుత్వేతర టీచర్లకు వర్తింపజేయ బడలేదు.

1968 పూర్వపు ఎరియర్సు విడుదలగాలేదు.

ఫేమిలీ బెనిఫిట్ ఫండు స్కీము ఎయిడెడ్ వారికి వర్తింప జేయబడలేదు.

రిటైర్ మెంట్ వయసు 60 సం.లకు పెంచలేదు.

జూనియర్ కాలేజీ అధ్యాపకుల సర్వీసు స్థిరీకరణ జరుగ లేదు. వారికి యు జి.సి. వేతనాలు ఇవ్వలేదు.

ప్రభుత్వ జి.ఓ.లు అన్ని మేనేజిమెంట్లు టీచర్లకు ఒకేసారి వర్తింపజేయబడటంలేదు.

హామీ యిచ్చికూడా యింత సాచివేత విధానం, ఇన్ని వివక్ష ధోరణులు, ఇంత పక్షపాత వైఖరి ప్రభుత్వం చూపుతున్నది.

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ హక్కుల రక్షణ ద్వారా బాధ్యతా నిర్వహణకు నిర్విరామ కృషి చేస్తున్నది. నిరక్షరాస్యతా నిర్మూలనకు, నిరుద్యోగం తొలగించేందుకు, జాతి ప్రయోజనాలకు ఉపయోగించే నూతన ప్రత్యామ్నాయ విద్యావిధానానికి యీ మహా సంస్థ అంకితమై ఉంది.

ఆ దృష్టితోనే 1974 లో 'నిర్బంధ పొదుపు' బలవంతపు మినహాయింపులకు వ్యతిరేకంగా పోరాడింది.

1975లో అసెంబ్లీకి వేలాది సంతకాలతో విజ్ఞాపన పత్రం సమర్పించింది.

1976లో ప్రభుత్వోద్యోగుల కున్న సౌకర్యాలు అందరికీ

# సంపాదకీయం

అన్వయింపజేయాలని కార్డ్స్ క్యాంపెయిన్ నిర్వహించింది.

అత్యవసర పరిస్థితిలో కూడా విద్యాభివృద్ధికి ఆటంకంగా తయారైన పనిగంటల పనిదినాల తగ్గింపుకై విద్యాసదస్సులు నిర్వ హించింది.

1977లో నేటివిటీ ఉత్తర్వు ఉపసంహరించాలని వేలాది సంత కాలతో ముఖ్యమంత్రికి విజ్ఞాపన పత్రం సమర్పించింది.

పదివేలమంది హాజరైన ఖమ్మం మహాసభల్లో నూతన ప్రత్యా మ్నాయ విద్యావిధానాన్ని రూపొందించింది.

—ఇన్ని విజ్ఞప్తులు చేసినా, సదస్సులు నిర్వహించినా, ఆందోళ నకు పూనుకున్నా జరిగింది స్వల్పం.

చివరికి 1978 ఫిబ్రవరి 13న జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు వేలాది టీచర్లు ధర్నాలో పాల్గొని ఆందోళనలో ప్రథమదశ కార్యక్రమం దిగ్విజయం చేయబడింది.

ఫలితంగా అప్పటి కోర్కెలపై 78 మే 24, 25 తేదీలలో విద్యామంత్రితో కో-ఆర్డినేషన్ సమావేశంలోపాల్గొని యు.టి.యఫ్. సమస్యా పరిష్కారానికి మరొకసారి కృషిచేసింది.

అయినా అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నయ్.

ఉపాధ్యాయులమధ్య వివక్షావైఖరి కొనసాగుతూనేఉంది.

ముఖ్యంగా విద్యాబిల్లు ఇదిగో....అదిగో అంటూ కొసమెరు పులు మెరుస్తూనేఉంది

వాటన్నిటినీ ప్రభుత్వ దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికితెచ్చి పరిష్కారం సాధించుకోటానికి యు. టి. యఫ్ 78 సెప్టెంబరు 8న ఆందోళనలో రెండవదశ కార్యక్రమంగా అసెంబ్లీముందు ప్రదర్శన జరపాలని నిర్ణయించింది.

అదే 'చలో హైదరాబాద్ !'

పోరాడనిదే ఏనాడూ ఏ సమస్యాపరిష్కారం కాలేదనేది గత చరిత్ర నేర్పిన గుణపాఠం. పోరాటం ద్వారానే సమస్యలు సాధింప బడతాయి, తద్వారా విద్యాభివృద్ధి సాధ్యమౌతుంది. అదే దేశ పురో గమనానికి రాచబాట అవుతుంది. ఇది నిత్య సత్యం. దాని సాధనకే చలో హైదరాబాద్ !

కదలండి ! వేలాదిగా పాల్గొని ప్రదర్శనను దిగ్విజయం చేయండి !

# వార్తా ప్రపంచం

## 10+2 స్థానే మూడంచెల విధానం

పాఠశాల స్థాయిలో 10+2 విద్యా విధానాన్ని రద్దుచేసి దాని స్థానే మూడు దశలలో అమలు జరిగే కొత్త విద్యా విధానాన్ని అనుసరించాలని రాష్ట్ర విద్యా మంత్రుల సమావేశం నిర్ణయించింది. ప్రాథమిక, సెకండరీ, హైయర్ సెకండరీ అనే మూడు దశలకు కూడా 10+2 విధానంవలెనే 12సం.ల వ్యవధిపడుతుంది. హైయర్ సెకండరీ దశ రెండేళ్ళపాటు ఉంటుంది కాగా మిగిలిన రెండు దశలకు ఎన్నేసి సంవత్సరాలు కేటాయించాలన్నది ఆయా రాష్ట్రాలు నిర్ణయించుకొంటాయి.

## ప్రభుత్వ కార్యాలయాల పనివేళల మార్పు

ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటివలె ఉదయం 10-30 గం. నుంచి సాయంత్రం 5 గం. వరకుగాక ఉదయం 7-30 నుంచి మధ్యాహ్నం 1-30 వరకు మార్చాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ స్థాయిలో సూత్రప్రాయంగా నిర్ణయం జరిగింది.

## విద్యార్థుల విస్తృతాందోళన

నోట్‌పుస్తకాలు, తెల్ల కాగితాలు సక్రమ ధరలకు అందించాలని, పాఠ్యగ్రంథాల్ని సకాలంలో సరఫరా చేయాలని, తుఫాన్‌వల్ల వాపస్ చేయవలసిన ఫీజులను తక్షణం తిరిగి యివ్వాలని కోరుతూ రాష్ట్రంలో వివిధప్రాంతాలలో వేలాదివిద్యార్థులు జూన్ 28న తరగతులను బహిష్కరించి అధికారులకు మెమోరాండా లిచ్చారు.

## మహారాష్ట్ర ఉద్యోగుల కరువుభత్యం పెంపు

మహారాష్ట్ర ప్రభుత్వోద్యోగుల కరువుభత్యాన్ని కేంద్రప్రభుత్వం ఇస్తున్న స్థాయికి పెంచుతూ ముఖ్యమంత్రి శ్రీ శరత్ పవార్ ఆగస్టు 9 న బొంబాయిలో ప్రకటించారు. ఉద్యోగులు 54 రోజులు సమ్మెచేసిన సందర్భంగా వారికి ఇచ్చిన అడ్వాన్స్‌లను తిరిగి తీసుకోవటం జరగదనికూడా ఆయన వివరించారు.

## విద్యామంత్రి వాగ్దానాలు

ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వారి నిష్పత్తిని 1:25 కి తగ్గించే విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తానని విద్యాశాఖామంత్రి కాకినాడలో రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల మహాసభ ప్రారంభిస్తూ ఆగస్టు 7 న ప్రకటించారు.

దీపెన్షన్ పునరుద్ధరించాలన్న కోర్కెను ప్రస్తావించి ఈ విషయం విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి ఆలోచించి ఏకాభిప్రాయానికి రావాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉపాధ్యాయుల సర్వీస్ కండిషన్లలో ఏవిధమైన తారతమ్యాలు ఉండకూడదనికూడా ఆయన స్పష్టంచేశారు. కనీస పెన్షన్ రు. 100 ఉండాలని కూడా ఆయన వెల్లడించారు. ఆశయాలు బాగానే ఉన్నాయ్. కాని ఆచరణలోకి వస్తాయా ? అనేదే అందరి సందేహం !.

## అభినవ కీచకులు

గూడూరు సమీపంలోని నెల్లటూరు ప్రభుత్వ చిల్డ్రన్స్ హోంలో ప్రశాంత్ అనే బాలకృష్ణయ్య బాలికలపై సాగించిన అత్యాచారాలు వెలుగులోకివచ్చాయి. అనాధ బాలికలయెడ అతడు క్రూరంగా ప్రవర్తించేవాడని, వారి రవికలు బ్లేడుతో కోసేవాడని, అత్యాచారానికి ముందు మద్యంతో నిద్రమాత్రలుకలిపి బలవంతంగా త్రాగించేవాడని అతని పైశాచిక చర్యలెన్నో విచారణలో బయటపడ్డాయి. కంచెలే చేలను మేస్తున్న ఇటువంటి దుర్మార్గాలు యీ సంక్షేమరాజ్యంలో యింకెన్ని జరుగుతున్నాయో !

## పోస్టుగ్రాడ్యుయేట్ ప్యూన్లు

ఢిల్లీ కార్పోరేషన్లో పల్గురు యమ్మేలు, ముప్ఫయిముగ్గురు గ్రాడ్యుయేట్లు తగిన ఉద్యోగాలు దొరక్క బ్రతుకు గడపటానికి ప్యూన్ ఉద్యోగాలు చేస్తున్నారట !

## విద్యా మంత్రుల సమావేశం–విద్య రాష్ట్ర జాబితాలో ఉండాలని నిర్ణయం

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, హర్యానా, పంజాబ్, త్రిపుర, సిక్కిం, మేఘాలయ, మధ్యప్రదేశ్, మణిపూర్, బెంగాల్ విద్యా మంత్రులు, అరుణాచల్‌ప్రదేశ్ అభివృద్ధి కమీషనర్ కలకత్తాలో సమావేశమయ్యారు. దానిలో బెంగాల్ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు కూడా పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి శ్రీ జ్యోతిబాసు దాన్ని ప్రారంభించారు. సమావేశంలో పాల్గొన్నవారంతా విద్య రాష్ట్ర జాబితాలో ఉండటమే సరయినదనే ఏకాభిప్రాయానికి వచ్చారు.


"మన గైడ్"

**శ్రీ గిరిజా గైడ్**

(రచన : శ్రీ బి. శోభనాచలం)

**3, 4, 5 తరగతులకు**

ప్రతి గైడునందు

- అన్ని సబ్జక్టులు ఉంటాయి !
- సోషల్ రికార్డు అదనంగా ఉంటుంది !
- మూల్యాంకనా విధానము - తగు మోతాదులో - తరగతి స్థాయికి అనుగుణంగా ప్రవేశపెట్టబడింది !

గత 25 సం॥ల నుండి మీ ఆదరాభిమానములను చూరగొన్న "గైడ్"

**"శ్రీ గిరిజా గైడ్"**

వెల : రు. 3-50; రు. 3-75; రు. 4-50

ప్రచురణ :

శ్రీ గిరిజా పబ్లికేషన్సు,

విజయవాడ-1.

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, తూర్పుగోదాజిల్లాశాఖ 10వ. విద్యా మహాసభలు

1978 సెప్టెంబరు 2, 3, తేదీలు పెద్దాపురం-లూథరన్ హైస్కూలులో

# ఆహ్వానము

తూర్పుగోదావరిజిల్లా 10వ విద్యా మహాసభలు పెద్దాపురం లూథరన్ హైస్కూలులో 1978 సెప్టెంబరు 2, 3 తేదీలలో జరుగనున్నాయి. మహాసభలను 2వ తేదీ ఉదయం 9 గంటలకు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు గౌ॥ శ్రీ భవనం వెంకట్రామరెడ్డిగారు ప్రారంభిస్తారు. ఆ సభలో శాసనమండలి సభ్యులు శ్రీయుతులు డి. శివరామరాజు, యం. జె. మాణిక్యాలరావు, యం. మాధవరావు యం. హనుమంతరావు మరియు జిల్లా అధికారులు, విద్యావేత్తలు పాల్గొందురు కావున తామందరుపాల్గొని సభలను దిగ్విజయం చేయగోరుచున్నాము.

ఇట్లు

వంతం పద్మనాభం, ఎమ్.ఎల్.ఎ. అధ్యక్షులు

పెద్దాపురం
17-7-78

వి. సూర్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి

ఆహ్వాన సంఘం.

## ఆహ్వానము

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ 5వ నూతన జనరల్ కౌన్సిల్ సమావేశము 1978 సెప్టెంబరు 9, 10 తేదీలలో రాష్ట్ర సంఘాధ్యక్షులు శ్రీ కె. నారాయణ రావుగారి అధ్యక్షతన, హైదరాబాదు రాంకోటివద్దగల ఆంధ్ర సారస్వతపరిషత్ హాలునందు జరుగును. కావట్టి రాష్ట్ర కౌన్సిలర్లు, ప్రత్యేకాహ్వానితులు విధిగా పాల్గొని సభలు జయప్రదము చేయగోరుచున్నాము.

ఎజెండా : 1. నివేదికలు 3. ఎన్నికలు
2. జమా-ఖర్చులు 4. ఇతరములు

ఎ. వెంకటస్వామి,
ప్రధాన కార్యదర్శి.

## చందాదార్లకు ముఖ్య మనవి

చందాదారుల నుండి పత్రికలచందా ఒకనెల తగ్గింప బడినదాన్ని గురించి లేఖలువస్తున్నాయి. 1977 సెప్టెంబరులో ఖమ్మం మహాసభల సందర్భంగా ప్రత్యేకసంచిక ప్రచురించి, దానివెల రు. 2/- ఉన్నకారణంగా చందాదారులందరికీ ఒక నెల పత్రిక తగ్గింపబడుతుందని ఆ సంచికలో ప్రకటించాము. దానినమలు జరిపిన కారణంగా ఆగస్టు 78 వరకు ఒకనెల ప్రతి చందాదారుకీ తగ్గింది. ఈ విషయం మరల అందరూ గుర్తింపగోరుతున్నాము. —సం॥

## 2, 3, 4, 5, తరగతులకు క్వార్టర్లీ పరీక్షా పత్రాలు సిద్ధంగా ఉన్నవి

ఉపాధ్యాయ సోదరీ, సోదరులారా !

గతంలో యు.టి. యఫ్. తూర్పుగోదావరిజిల్లా శాఖ పక్షాన ప్రచురించిన ప్రశ్నపత్రాలను తీసుకొని ప్రోత్సహించిన మీ అందరికీ అభివందనలు. మళ్ళీ 78 క్వార్టర్లీ పరీక్షాపత్రాలు మీసూచనలు, సలహామేరకు యస్.సి.యి.ఆర్.టి. మోడల్‌లో తయారై సిద్ధంగా ఉన్నవి.

వీటి అమ్మకంద్వారా మిగిలిన ప్రతి నయాపైసా యు.టి.యఫ్.కే చెందుతుంది గాన కార్యకర్తలు, అభిమానులు మరింత ప్రోత్సహించి సహకరింపప్రార్థన. సొమ్ముముందుగా పంపినవారికి పోస్టల్ ఖర్చులు ఉచితం.

రేట్లు : 5 వ తరగతి (హిందీతో) 0-40 పై
2, 3, 4, 5 తరగతులకు 0-30 పై.

ఇట్లు,

ఎ. లెనోర, కరస్పాండెంట్,
యు. టి. యఫ్. ఎగ్జామినేషన్ సెంటర్,
ఎంప్లాయీస్ హోం, అమలాపురం-533 201

జన్మదిన కానుక: శ్రీ పి. సత్యనారాయణరెడ్డి(శ్రీరామగిరి, ఖమ్మం) తమ కుమార్తె చి॥ లక్ష్మిసుజాత జన్మదిన కానుకగా భవననిధికి విరాళం రు. 10/- పంపారు.

## స్వాతంత్ర్యోత్సవ వేళ

— జి. శ్రీహరి

ఈ స్వాతంత్ర్యోత్సవ వేళ
వాడవాడల వేడుకలు జరుపుకొనే వేళ
రమ్యమైన కవితను రాయాలని కలం పట్టాను
రాతిరి మందగించిన మనసుకు పదును పెట్టాను
ఈ ప్రభాత వేళ —
ఎటు చూసినా కనిపించేవి ప్రభాత్ భేరీలు
కావు—స్వాతంత్ర్య సమరంలో అసువులొడ్డిన అమరవీరుల గోరీలు
ఎటకేగినా వినిపించేవి స్వాతంత్ర్య వినాదాలు
కావు — అనాథలు, అన్నార్తులు చేసే ఆర్తనాదాలు
ఎటు చూసినా కనిపించేవి రంగుల తోరణాలు
కావు — నగటు మనిషిని సతమతం చేసే సమస్యల తోరణాలు
ఎటు చూసినా కనిపించేవి రెపరెపలాడే త్రివర్ణ పతాకాలు
కావు — సమస్యల సమరంలో హోరాహోరీగా పోరాడి
ఆరిపోవుటకు సిద్ధంగావున్న సామాన్యుల జీవితాలు
నేటి సభల్లో —
ఎటుకేగినా వినిపించేవి పాలకుల (శుష్క) వాగ్దానాలు
పాలితుల పాలిటి సమ్మోహన బాణాలు
ఇక్కడ
అవినీతికి సన్మానం జరుగుతుంది.
అధర్మానికి వలుకుబడి పెరుగుతుంది.
ఇది సామాన్య ప్రజల సంక్షేమ రాజ్యమా ?
కాదు కాదు — ఒకరు మరియొకరిని దోచుకొనే రాక్షస రాజ్యం.
ఈ స్వాతంత్ర్యోత్సవ వేళ
పైశాచిక ప్రవృత్తి రాజ్యమేలే వేళ
ఏమి రాయను నేస్తం ?
ఏమి రాసినా అది చాదస్తం !

## మనం!

శ్రీ గుబ్బల సత్యనారాయణమూర్తి
ఏనుగుపల్లి, తూ. గో. జిల్లా.

కాలం మన గురువు
అనుభవం మన పుస్తకం
కాలం చెప్పిన పాఠాల్ని
అనుభవంలో చదువుకుందాము.
మన గురువుకు అప్పులుండవు
మన పుస్తకంలో తప్పులుండవు.
మనం అందరికీ పాఠం చెప్తాము
మనం అందరినీ అక్కున చేర్చుకుంటాము.
కులం....మతం....జాతి అగడ్తలు
మనల్ని అడ్డవు !
తెలుపు నలుపు రంగు భేదాలు
మనల్ని సోకవు !
మనం ఐక్యతా సింధువులం !
మనం అమృతవాహిని బంధువులం !

# కథలు గేయాలు!

సీరియల్ — 6

## అభినవ నీతిచంద్రిక

(బ్రెయిన్ వాష్)

— మైనేని వెంకటరత్నం

"సరస్వతి లెక్చెరర్ ఉద్యోగానికి ఏడుకాలేజీలకు దరఖాస్తు పెట్టిందట! మూడు కాలేజీలకు ఇంటర్వ్యూవచ్చి....తగిన అర్హతలు లేవు పొమ్మన్నారట అధికారులు. ఆవిడ ఎమ్మేలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలయిందట ! నూటికి తొంభైనాల్గు మార్కులు అన్ని సబ్జక్టుల్లో వచ్చాయట! అంతేగాక ఆరుఅవార్డులు....నాలుగు బంగారు పతకాలూ పొందిందట ! దింపుడు కళ్ళాం ఆశగా నాలుగోసారి పట్టణానికి ఇంటర్వ్యూకి వచ్చిందట ! అక్కడ కొత్తగా పెట్టిన జూనియర్ కాలేజీలో ఖాళీలు ప్రకటించారట ! ఆవిడ కెలాగైనా ఉద్యోగం కావాలట ! లేకపోతే మనిషి మనిషిగా బ్రతకలేదట !"

— తన మేనకోడలి దీనస్థితిని ఏకరువుపెట్టి సాయపడమని అర్థించాడు శాస్త్రి....విష్ణుశర్మను.

ఆ విషయం విన్నవాళ్ళందరికీ ఆశ్చర్యమేసింది.

"చదువుల సరస్వతికి....అన్ని మెరిట్స్‌ఉన్న అమ్మాయికి ఉద్యోగం దొరక్కపోవడమేమిటి ?"

"ఎందుకాశ్చర్యం ? యీ రాజ్యంలో ఇది మామూలేగా !" అన్నాడు విష్ణుశర్మ.

"మరీ యింత ఘోరమా ?" అందరిలో కోపం....తాపం.... ఓ నిరసన భావం.

"విద్య వ్యాపార సాధనంగా మారింది. పట్టణంలో చూడదంలా....హైస్కూల్లో చేరాలంటే పాతిక....కాలేజీలో ప్రవేశించాలంటే ఐదొందలు....ఇంజనీరింగు సీటుకు పదిహేనువేలు....డాక్టర్ సీటుకు పాతికవేలు....డొనేషన్లు కట్టందే సీట్లే రావటంలేదు. ఇక ఉద్యోగం లభించాలంటే ఎన్నిపాట్లుపడాలో చూడండి ! పరిపాలనా వ్యవస్థే అలావుంది. అంతా ఉత్తర, దక్షిణాల మయం !" — వివరించాడు విష్ణుశర్మ.

'ఇంతకీ ఉద్యోగం దొరుకుతుందా .... దొరకదా ?' మళ్ళీ అడిగేడు శాస్త్రి....ఆతురత కొద్దీ.

'ఎందుకు దొరకదు....కొత్తగా పెట్టిన కాలేజీ అని డొనేషన్ల పేరుతో వేలు వసూలు చేస్తున్నారు.. కాలేజీ కమిటీ వాళ్ళు. ఐదు సంవత్సరాలకుగాని గ్రాంటు రాదట ! అప్పటిదాకా కాలేజీ నడవాలిగాబట్టి ఉద్యోగస్థుల నుండి డబ్బు పిండుతున్నారు. ఈ కాలేజీలో ఉద్యోగం రేటు పదివేలు. ఆతర్వాత జీతం నెలకు రెండొందలు .... అదీ పూర్తి జీతం తీసుకొంటున్నట్లు ఎక్విటెన్స్ మీద సంతకం పెడితేనే ! మరి ఆ పదివేలూ ఉన్నాయా ?' — ఎదురు ప్రశ్నవేశాడు

విష్ణుశర్మ.

'అన్ని హంగులూ ఉంటేనేగా కాలేజీ స్థాపనకు పర్మిషన్ ఇచ్చేదీ ! మరి విద్యాశాఖ వారు ఎలా అంగీకరించారూ ?' అమాయకంగా అడిగేడు చౌదరి.

"ఏ మంత్రినో పట్టుకొనేదీ ...పలుకుబడి ఉపయోగించేదీ.... పర్మిషన్ తెచ్చుకొనేదీ ! ఆ తర్వాత మామూలే....దోపిడీ....విలువ దోపిడీ ! కలవాళ్లకి అన్నీ కాళ్ళకిందకు వచ్చే సమాజమిది !" తేటపరిచాడు విష్ణుశర్మ.

పిట్టూర్చాడు శాస్త్రి ... ఆ పద్మవ్యూహం సంగతి విని.

"సరస్వతి పేర ఓ ఇల్లుంది....దాన్ని అమ్మేస్తే ?"ఓ ఊహ వచ్చింది అతనిలో.

అంతలో జాన్, మూర్తి, సుబ్బారావు, హుస్సేన్ అంతా పరుగెత్తుకొచ్చారు చైతన్య సదన్‌కి. వాళ్ళంతా అక్కడ ఎయిడెడ్ యు.పి. స్కూల్లో టీచర్లు.

"కొంప మునిగినట్టు ఏమిటా పరుగు !" వాళ్ళ హడావుడి చూసి అడిగేడు శర్మ.

"కొంపే మునిగింది....చూడండి !" అంటూ ఓ కాగితం చేతికిచ్చాడు విష్ణుశర్మకు.... జాన్.

అది రిట్రెంచ్‌మెంట్ నోటీసు.

తగినంతమంది పిల్లలులేని కారణంగా పోస్టులు తగ్గిపోయాయని ఆరుగురికి రిట్రెంచ్‌మెంట్ నోటీసు ఇచ్చింది మేనేజిమెంటు వాళ్ళల్లో ఒక్కొక్కరూ పదిహేనేళ్ళ సర్వీసు చేశారు ఆ మేనేజిమెంటుక్రింద. వాళ్ళంతాలబోదిబోమటూ వీధినపడి చైతన్యసదన్‌కి పరుగెత్తుకొచ్చారు.... బ్రతుకులు కాపాడుకోటానికి.

"విన్నారా.... ఇదీ సంగతి.... ఈ సంక్షేమరాజ్యంలో చదువుకోటానికి అవకాశాలే తక్కువ. అవకాశంవున్నా సీట్లురావు. అష్టకష్టాలుపడి చదువు ముగించినా ఉద్యోగం దొరకదు. దొరికి పదిహేనేళ్ళు పనిచేసినా రిట్రెంచ్‌మెంటు ! ఇదో విషవలయం, సంఘటిత శక్తితో దీన్ని ఎదుర్కోవాలి. ఎవరికివాళ్ళు పట్టనట్టు కూర్చుంటే యీ ఆపద ఎప్పుడో ఒకప్పుడు అందరినీ చుట్టుముట్టేదే. దీన్ని ఊరికే పోనీయగూడదు. సాయంత్రం పట్టణంలోవున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులందర్నీ సమావేశపర్చండి. ప్రజా సంఘాల తోడ్పాటు అడగండి. పోరాటకమిటీ ఏర్పరచి ఆందోళనకు పూనుకోండి. దీన్ని ఎదుర్కోవాలంటే అదొక్కటే మార్గం !" కర్తవ్యబోధచేసి ఆ కార్యక్రమం దిగ్విజయం చేయటానికి అందరితోపాటు తానూ బయలుదేరాడు విష్ణుశర్మ.

## కార్యకర్తలకు సూచనలు

రెండవదశ ఆందోళనా కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో సెప్టెంబరు 8 న వేలాదిమంది ఉపాధ్యాయులతో అసెంబ్లీముందు ప్రదర్శన జరపాలని యు.టి.యఫ్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. ఉపాధ్యాయ సంఘాలన్నింటినీ కలిసి రావలసిందిగా లేఖలువ్రాసింది. ప్రదర్శనను జయప్రదం చేయటానికి అందరూ కదలండి. అన్ని జిల్లాల నుండి ప్రదర్శకుల్ని సమీకరించండి.

1. గతంలో యు.టి.యఫ్. చేపట్టిన కార్యక్రమాల వివరాలతో 'చలో హైదరాబాద్' పేర పదిపైసల రేటుతో కరపత్రం వెలువడుతున్నది. అది టీచర్లను చైతన్యపరిచే సాధనంగా కార్యకర్తలు వినియోగించుకొని విరివిగాప్రచారంలోకి తేండి. ఎవరెవరికి ఎన్నికావాలో సొమ్ము పంపుతూ ఆర్డర్ ఇవ్వండి.

2. ప్రతిజిల్లా టూరిస్టు బస్సులలోగాని, రైళ్ళలోగాని 7వ తేదీ రాత్రికి బయలుదేరి 8వ తేదీ ఉదయానికి హైదరాబాద్ చేరాలి. వీలయినచోట్ల రైల్వే కన్సెషన్‌లకు వెంటనే ప్రయత్నించండి.

3. సెప్టెంబరు 8 ఉదయం 10 గంటలకు ఊరేగింపు ప్రారంభమవుతుంది.

4. ఆయా జిల్లాలు బేనర్సు పతాకాలు, ప్లేకార్డులు ఎవరికివారే ఏర్పాటు చేసుకొని వెంట తెచ్చుకొనండి.

5. జిల్లాల్లో ఉన్న అన్ని విద్యాలయాల గోడలపై 'చలో హైదరాబాద్, సెప్టెంబరు 8 ఉపాధ్యాయ ప్రదర్శన జయప్రదం చేయండి !' వివిధ సమస్యల్ని పేర్కొంటూ నినాదాలు వ్రాయించండి.

6. ఆ ప్రదర్శనలో ఆయా జిల్లాలకు నిర్ణయించిన కోటాల్లో విధిగా 10 శాతం మహిళలు ఉండాలి.

7. ఆంధ్ర సారస్వత పరిషత్ హాలు, రామ్‌కోటి, హైద్రాబాద్‌లో ఉచిత వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి. అక్కడి నుండే ప్రదర్శన ప్రారంభమౌతుంది.

8. మహిళా ఉపాధ్యాయినులకు ప్రత్యేక వసతి ఏర్పాట్లు ఉన్నాయి.

వెంటనే కదలండి ! మహా ప్రదర్శనను జయప్రదం చేయండి !

## జీవిత చందాదారులు

266. శ్రీ జి. విశ్వనాథరావు, రాపల్లి, ఖమ్మంజిల్లా
267. శ్రీ యస్. కోటయ్య, రాపల్లి, ఖమ్మంజిల్లా
268. శ్రీ జి. రామకోటి, రాపల్లి, ఖమ్మంజిల్లా
269. శ్రీ కె. వెంకటరామిరెడ్డి, రాపల్లి, ఖమ్మంజిల్లా
270. శ్రీ వి. రామదాసు, యేదులాపురం, ఖమ్మంజిల్లా
273. శ్రీమతి బి. మేరీగ్రేస్, మొగళ్ళమూరు, తూ.గో. జిల్లా
274. శ్రీమతి బి. ప్రభావతమ్మ, తుమ్మలపల్లి, తూ.గో. జిల్లా
275. శ్రీ ఎ. ఉమామహేశ్వరరావు, అమలాపురం, తూ.గో, జిల్లా
276. శ్రీ పి. ఆంజనేయులు, ఉత్తరపాలెం, ప.గో. జిల్లా
277. శ్రీ యన్. వి. సుబ్బారావు, పిఠాపురం, తూ.గో. జిల్లా
278. శ్రీ జె. మల్లికార్జునరావు, జాగర్లమూడివారిపాలెం, తూ. గో. జిల్లా
280. శ్రీ అర్. యస్. జయశేఖర్, ఇలపర్రు, ప గో. జిల్లా
281. శ్రీ కె. రామకృష్ణమూర్తి, మొగళ్ళమూరు, తూ.గో. జిల్లా
284. శ్రీ జి. గోపాలరావు, సోమేశ్వరం, తూ.గో. జిల్లా
287. శ్రీ కె. పంచాక్షరి, తెట్టలపాడు, ఖమ్మంజిల్లా
288. శ్రీ జి. చెన్నబసవయ్య, కాకినాడ, తూ గో. జిల్లా

★

# జీవిత చందాదారులు



215. శ్రీ పి. శ్రీరంగ సత్యనారాయణ,
మొగల్తూరు, ప గో.జిల్లా.



230. శ్రీ వి. హనుమయ్య,
పాపాయిగూడెం, ఖమ్మంజిల్లా.



250. శ్రీ టి. జయదర్శనం,
బాపూజీపురం, ప.గో.జిల్లా.



251. శ్రీ సిహెచ్. అప్పారావు,
పిఠాపురం, తూ.గో.జిల్లా.



252. శ్రీ డి. నర్సింహాచారి,
కల్వకుర్తి, మ. నగర్ జిల్లా.



253. శ్రీ వి. శ్రీపతిస్వామి,
నిజామాబాద్.



262. శ్రీ వేగేశ్న సత్యనారాయణరాజు,
కోపల్లి, ప.గో.జిల్లా.



263. శ్రీమతి యం. తులశమ్మ,
కొల్లాపూర్, మ. నగర్ జిల్లా.



264. శ్రీ జి. బుచ్చారెడ్డి,
తూముకుంట, మ. నగర్ జిల్లా.



265. శ్రీ టి. గోవర్ధనరెడ్డి దంపతులు
తూముకుంట, మ. నగర్ జిల్లా.



297. శ్రీ ఆర్. రామరాజు
సఖినేటిపల్లి. తూ॥ గో॥ జిల్లా



282. శ్రీ సి. దక్షిణామూర్తి
రంగాపూర్, మ. నగర్ జిల్లా



283. శ్రీ సిహెచ్. యస్. యస్.
రంగప్రసాద్,
మానేపల్లి, తూ॥ గో॥ జిల్లా



285. శ్రీ సిహెచ్. వీరయ్య
పెద్దివారిపాలెం, ప్రకాశంజిల్లా



286. శ్రీ యం.డి. రహమాన్ బేగ్
పర్చూరు, ప్రకాశంజిల్లా



శ్రీ చౌదరి దంపతులు, అమలాపురం తూ॥ గో॥ జిల్లా
భవన నిధికి రు. 400/-



గుంటూరుజిల్లా, పొన్నూరు సమితి చింతలపూడి సెంటర్ కార్యదర్శి, యు. టి. యఫ్. కార్యకర్త శ్రీ కె. కమలాకరరావు కుమారుడు చి॥ కె. సదాశివరావు సీనియర్ ఇంటర్ చదువుతూ లారీప్రమాదానికి గురియై జూలై 22న మృత్యువాత పడ్డాడు. దుఃఖసాగరంలోమునిగిన వారి కుటుంబానికి యు. టి. యఫ్. తరపున గాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము.

# సమస్యాతోరణం

## హిందీపండితులు – వారిసమస్యలు

—షేక్ సాబ్జాన్,
ప్రధాన కార్యదర్శి, కోటసమితి.

హిందీ నేడు అనేక వివాదాలకు గురిఅయివున్నా భారత ప్రజలమధ్య అనుసంధాన భాషగా గుర్తించియున్నారు. దక్షిణాది ప్రజలు అంగీకరించేంతవరకు వారిపై బలవంతంగా రుద్దము అంటున్నా, ప్రభుత్వ వ్యవహారాలలోను, పోస్టలు, రేడియో, సినిమాలలోనూ దానిది పైచేయిగానేవుంది. పరీక్షలలో ప్యాసు అగుటకు దానికి కొన్నిమార్కులు నిర్దేశించియున్నారు.

హిందీని గురించి గంభీరోపన్యాసాలు యిచ్చినా అది బోధించు ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమగుచున్నారు. కేంద్ర ప్రభుత్వంనుండి సకాలములో గ్రాంటులు రాక నెలలతరబడి జీతములు ఏలిచిపోయి హిందీ పండితులు పస్తులతో కాలము గడుపుచున్నారు. మార్చినుండి రావలసిన పోస్టులు కంటిన్యూ ఉత్తర్వులు యీ నెల (ఆగస్టు) వచ్చాయంటే పరిస్థితి ఏమనుకోవాలి.

లెక్కకు మించియున్న ఈ క్రింది సమస్యల పట్టికచూస్తే ఎంత నైరాస్యానికి ఉపాధ్యాయులు గురియై ఎన్ని కష్టాలతో కాలం గడుపుతున్నారో గుర్తించవచ్చు.

1. ఇతర ఉపాధ్యాయులకు యిచ్చునట్లుగా వారి వారి గ్రేడుల ననుసరించి “హిందీ”లో అదనపు అర్హతగలిగి గ్రేడ్–1, గ్రేడ్–2 లలో పనిచేయుచున్న హిందీ పండితులకు అదనపు యింక్రిమెంట్లు యివ్వవలెను.

2. ట్రయినింగులేని భాషా పండితులకు మెర్జెడ్‌స్కేల్సులో జీతము ఫిక్సుచేసి, యింక్రిమెంట్లు యివ్వమని జి.ఓ. ఉన్నను కొన్ని సమితులు, జిల్లాలలో యింతవరకు ఆ జి. ఓ. ను పాటించుటలేదు.

3. విశారద, భూషణ ఉత్తీర్ణులయి ట్రయినింగు కానివారిని యిప్పుడు ట్రయినింగు తప్పనిసరి అని అన్నారు. కానీ ప్రస్తుతము జూనియర్ ట్రయినింగు కళాశాలలు లేవు. కావున వీరు బి. ఎ. ప్రవీణ లేక విద్వాన్ పరీక్ష ఉత్తీర్ణులై సీనియర్ హిందీ పండిట్సు ట్రయినింగుకు వెళ్ళవలసివుంది. కానీవారికిచ్చిన కాలపరిమితి చాలా తక్కువ కావున ప్రభుత్వము ఇన్ సర్వీసు పండితులకు ప్రత్యేక శిక్షణాలయములు యేర్పాటు చేయవలెను.

4. ఇన్ సర్వీసు పండితులకు శిక్షణాకాలమునకు జీతములు చెల్లించుటలేదు. 75–76 విద్యా సంవత్సరమునకు కేవలం తెలుగు పండితులకు మాత్రం శిక్షణా కాలమునకు జీతములు చెల్లించారు. కానిహిందీపండితులకు చెల్లించలేదు. కావునఇన్‌సర్వీసు పండితులను శిక్షణా కాలమునకు జీతములు చెల్లించవలెను.

5. ఎస్.జి.బి టి ట్రయినింగు పొందు విద్యార్థులకు ప్రభుత్వము స్టయిఫండు ఇచ్చుచున్నది. కానీ హిందీ శిక్షణ పొందు విద్యార్థులకు సౌకర్యములేదు. కావున ప్రభుత్వము నెలకు కనీసం రు. 100 ల స్టయిఫండు నేర్పాటు చేయవలెను.

6. నెల్లూరులోని ప్రభుత్వ సీనియర్ హిందీపండిట్సు ట్రయినింగ్ కళాశాలకు అయిదుగురు అధ్యాపకులు కావలసియున్న 3సం॥లుగా కేవలం ఒక అధ్యాపకుని తోనే కళాశాల నడపబడుచున్నది. కావున తగు సిబ్బందిని ఏర్పాటు చేయవలెను.

7. ప్రభుత్వ శిక్షణ కళాశాలలో శిక్షణపొందు విద్యార్థులకు హాస్టలు వసతి కలిగించవలెను.

8. ప్రవీణ, విద్వాన్ ఉత్తీర్ణులయినవారు ఏదేని విశ్వవిద్యాలయమునుండి బి.ఏ. పార్టు–1 ఇంగ్లీషులో పరీక్షనిచ్చుటకు అనుమతించి, ఉత్తీర్ణులయినవారికి బి ఏ. డిగ్రీ యిచ్చు ఏర్పాటుచేయవలెను.

9. ఇతర ఉపాధ్యాయులవలెనే హిందీ పండితులకు కూడా సెలక్షన్‌గ్రేడ్ యివ్వవలెను.

10. ఉన్నత పాఠశాలలలో పనిచేయు గ్రేడ్–2 హిందీ పండితులకు మాత్రమే గ్రేడ్–1 ప్రమోషన్ లభించుచున్నది. కానీ అప్పర్‌ప్రయిమరీ పాఠశాలలలో పనిచేయు గ్రేడ్–2 పండితులకు మాత్రము ఎన్నేళ్ళు సర్వీసుఉన్నను ప్రమోషన్ లభించుటలేదు. జి. ప. వారు సీనియారిటీ లిస్టునందు సమితులలోపనిచేయు గ్రేడ్–2 పండితుల పేర్లుకూడా నమోదు చేయవలెను.

11. గ్రేడ్–2 హిందీ పండితుడు ఉన్నత తరగతులు బోధిస్తున్నపుడు యిప్పుడిస్తున్న రు. 10/– స్పెషల్ అలవెన్సును రు. 30/–లకు పెంచవలెను.

12. హిందీ అధ్యాపకుడు కనీసం ఎస్. ఎస్. ఎల్. సి. ఉత్తీర్ణుడై వుండవలెననెడి నిబంధన లేకపోయినను పై అర్హత లేని వారిని డి.యస్.సి. వారు, శిక్షణ కళాశాలలవారు, యింటర్వ్యూలకు పిల్చుటలేదు. కేవలం హిందీ అర్హతలు సంపాదించుకొన్నవారికిది ఎంతో నష్టమును, నిరుత్సాహమును కలిగించుచున్నది.

13. బి. కాం. చదువు విద్యార్థులకు హిందీని రెండవ భాషగా ప్రవేశ పెట్టవలయును.

14. ఆంధ్రప్రదేశ్ మొత్తమునకు హిందీ పండిట్సు ట్రయినింగ్ ప్రవేశ పరీక్షల కేంద్రములు కేవలం హైదరాబాదు, విజయవాడ, కర్నూలులో పెట్టేరు. ఈ కేంద్రములు నెల్లూరు, చిత్తూరు, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతములవారికి ఎక్కువ వ్యయప్రయాసలను కలిగించుచున్నవి. కావున ప్రతి శిక్షణా కళాశాలను ప్రవేశ పరీక్షల కేంద్రములుగా నుంచవలయును.

15. ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలలలో ప్రస్తుతము బోధింపబడుచున్న హిందీ పుస్తకములలో మార్పును కలిగించవలెను.

16. హిందీ పండితుల వేతనాలకై కేంద్ర ప్రభుత్వముపై ఆధారపడక, వేతనాలు చెల్లించే బాధ్యత రాష్ట్రప్రభుత్వమే స్వీకరించి దానికయ్యే ఖర్చును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వార్షిక బడ్జెటులో చేర్చవలయును.

17. మూడవ ప్రణాళిక, నాల్గవ ప్రణాళికలో సృష్టింపబడిన హిందీ పోస్టులన్నింటిని వెంటనే నాన్‌ప్లాన్ పోస్టులుగా మార్చవలయును.

18. ప్రస్తుతంవున్న పీరియడ్లు హిందీభాషా బోధనకు సరిపోవడంలేదు. కావున ప్రతి తరగతికి కనీసం వారమునకు అయిదు పీరియడ్లు యివ్వవలెను.

19. ప్రతి పుల్‌ఫ్లోన్ హైస్కూలునందు పీరియడ్ల సంఖ్యతో నిమిత్తము లేకుండా కనీసం ఒక గ్రేడ్–1 పండితుని నియమించవలెను;

(సశేషం)

# నేటి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు

శ్రీమతి మోటూరు ఉదయం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం.

పెళ్ళయిన ఆడపిల్ల సంసారంలోపడి, ఇంటిపని చేసుకుంటూ పిల్లలకూ, భర్తకూ, కుటుంబానికి సక్రమంగా సేవలు చేయగలిగితే, ఆమె బాధ్యత చక్కగా నెరవేర్చినట్టే.

నేడున్న ఆర్థిక దుస్థితిలో కుటుంబ అవసరాలు తీరాలంటే భర్తతోపాటు, భార్యకూడా వుద్యోగంచేసి డబ్బు గడించాల్సిందే. పెళ్ళికాని పిల్ల అయితే తండ్రికో - అన్నకో - చేదోడువాదోడుగా వుండవలసిందే.

ఈ రెండు బాధ్యతలూ నెరవేర్చటం చాలా కష్టమైనపని. వంట్లో శక్తినంతా పీల్చి పిప్పిచేసే - యీ రెండు బాధ్యతలమధ్యా మహిళలు నలిగిపోతున్నారు. ఈ సమస్య ఒక భారతదేశ స్త్రీలకే కాదు, ప్రపంచంలోనున్న పెట్టుబడిదారీ దేశాలన్నిట్లలో మహిళలస్థితి ఇలాగే వుంది.

మహిళలు "పని" విషయం పరిశీలిస్తే, అధికార లెక్కల ప్రకారం మెదడుతో పనిచేసినా - శారీరకంగా పనిచేసినా, పనిచేసే మానవుల సంఖ్య-163 కోట్ల 70 లక్షలు. అయితే అందులో మహిళలు 56 కోట్ల 20 లక్షలు వున్నారు.

మహిళలు ఆర్థికజీవనంలో పాల్గొనటం ద్వారా ఉపయోగం, నిజమైన సమానతకు ఆర్థిక స్వాతంత్ర్యానికి నిర్ణయాత్మకమైనది. ఏనాడో శతాబ్దాల క్రింద-స్త్రీపురుషులకుసమాన పనికి సమానవేతనం అనే నినాదం ఏనాటిదో ఈనాటికి పోరాడవల్సి వస్తున్నది. 1951లో అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐ. యల్. ఒ.) సమాన పనికి సమాన వేతనం తీర్మానం ఆమోదించింది. ఇది 27 సంవత్సరాలయినా అమలు జరుగుటలేదు.

సామాన్య స్త్రీల విషయం పరిశీలిద్దాం.

ఇంటి పనులతోనే వళ్ళుహూనమైపోతుంది. కాస్త కూస్తో ఉన్నవారయితే పనివాళ్ళను పెట్టుకుంటారు. అలాటి ఇళ్ళల్లో అజమాయిషీ చేయడంవరకే గృహిణి బాధ్యత.

కానీ : వంటమనిషీ పనిమనిషీ, ఆయాలను పెట్టుకోగల స్థోమత ఎంతమంది కుంటుంది ?

గ్రామాలలో రైతు స్త్రీలు, కూలీనాలీ చేసుకొనేస్త్రీలు, కార్యాలయాల్లో పనిచేసే గుమాస్తాలూ టైపిస్టులు - కాలేజీలో పనిచేసే లెక్చరర్లూ పాఠశాలల్లో పనిచేసే పంతులమ్మలు, హాస్పిటలులో పని చేసే నర్సులు - ఇంకా అనేక పనులు చేసే మహిళలు బయట పనిచేసి వచ్చి వాళ్ళే ఇంటిపని అంతా చేసుకోవాలి. బిడ్డల సంరక్షణ చూసుకోవాలి. వాళ్ళకు విశ్రాంతి వుండదు. మనశ్శాంతి ఉండదు. వారి పనిభారం ఎలా తగ్గించాలి అనేది అందరూ ఆలోచించాలి. మహిళా వుద్యమాలు యీ మహిళల కొరకు ఎంతో కృషిచేయవల్సి వుంది.

వారి ఆశయాలు నెరవేరి జీవితాలకు ఒక అర్థం, నిండుదనం కావాలంటే ఏమిచెయ్యాలి ? అనేది నేడు అందరికీ ఎదురయ్యేప్రశ్న.

## సమాజంలో మహిళల హక్కులు

చట్టరీత్యా - ఆచరణరీత్యా - సమాజంలో మహిళల విషయం చూస్తే అనేక దేశాలలో రాజ్యాంగాలలో సమానహక్కులు పొందుపరచటం - చట్టాలుచేయడం జరిగింది. 1948 లో ఐక్యరాజ్యసమితి ప్రణాళికలో పొందుపర్చబడినది. 1967 నవంబరు 7 వ తేదీ ఐక్యరాజ్యసమితి సాధారణ సమావేశం - స్త్రీ పురుష వివక్షతను తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఇటీవల ఐక్యరాజ్యసమితి అన్ని దేశాలను, యీ పనులు నిర్వహించే మహిళల సమస్యలను పరిశీలన చేసి ఆ వివరాలు వాటికి పరిష్కార సూచనలు పంపమని కోరింది.

ప్రపంచంలో 28 దేశాలు మాత్రమే, ఆ సమాచారం పంపాయట. పంపని దేశాలలో మన భారతదేశం ఒకటి.

ఫిన్‌లాండు దేశం యీ విషయంలో దేశంలో పనిచేస్తున్న మహిళలను గురించి సెన్సెస్ తీసి వివరాలు ఐక్యరాజ్య సమితికి పంపిస్తూ కొన్ని సూచనలు చేసింది.

"బట్టలు వుతకటం - బజారు పనులు పిల్లలకి తిండిపెట్టి ఆడించి నిద్రబుచ్చటం, ఇల్లు శుభ్రం చేయటం, వంటా - వార్పూ, పాచిపనులు చేసే మహిళల లెఖ్ఖలు తీశారు. యీ క్రింది విధంగా వారు చెప్పారు.

1. ఈ పనులన్నీ 100కి 80మంది గృహిణులే చేస్తున్నారు.
2. 100కి ఒక్కరో ఇద్దరో భర్తలు యీ బాధ్యతలను గౌరవంగా నిర్వహిస్తున్నారు.
3. 10-12 శాతం పనివాళ్ళు లేదా మిగతా కుటుంబసభ్యులు యీ భారం పంచుకుంటున్నారు.

ఇక ఈ విషయాలలో గ్రామాలలో స్త్రీలస్థితి చూస్తే మరింత బాధ్యతల భారంతో కృంగిపోతున్నారు.

వంట, పిల్లల పోషణ - ఇల్లు చక్కపెట్టుకోడం ఎలాగూ తప్పవు. వీటికితోడు నీళ్ళు మోసుకు రావాలి. పశువులను, కోళ్ళనూ చూచుకోవాలి. పాలు పిండటం, కట్టెపుల్లలు ఏరుకురావడం, గుడ్డలు ఉతుక్కోవడం. ఇంతేగాదు; ఆమె పొలం పనులలోగూడా మగవాళ్ళకి సాయపడాలి. పురుషులకి పొలానికి అన్నం పట్టుకు వెళ్ళాలి. ఎరువులు - విత్తనాలు పురుషులతోపాటు పొలంలో చల్లాలి. గడ్డి మోపులు మోసుకురావాలి. నాట్లు వేయడం, కలుపు తీయటం, నూర్చటం, తూర్పారపట్టడంతో స్త్రీలు చెయ్యి వేయనిదే పనులు పూర్తిగావు.

అలా ఇంటిపని, బయటపని బిడ్డల పోషణతో గ్రామీణ స్త్రీలు సతమతమవుతున్నారు. వారు విధి విరామం లేని పనులతో మానసికంగా అభివృద్ధి అయ్యే అవకాశం లేకుండా పోయింది.

సమాన హక్కుల విషయంలో కొంత అభివృద్ధి సాధించినప్పటికీ మహిళల యెడ ఇంకా వివక్షత గణనీయ స్థాయిలో సాగుతూనేయుంది. యీ వివక్షత, మానవ హుందాతనానికీ - సమాజ కుటుంబ సంక్షేమానికి వ్యతిరేకమైనది. దేశ సేవలో - సమాజసేవలో మహిళలు తగినంతగా పాల్గొనడానికి యీ వివక్షత ప్రతిబంధకంగా తయారవుతుంది.

ప్రతి ఒక్కరికీ పనిచేసే హక్కు ప్రాథమిక మయినది. సమానపనికి సమానవేతనమనే హక్కుకు, దీనికి మిక్కిలి సంబంధ

మున్నది. పని-వేతనం విషయంలో వివక్షతఉన్న విషయం స్పష్టం. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానంలో ఉన్నదేశాలలో - సమానవేతన సిద్ధాంతంచట్టరీత్యా అంగీకరించినా ఆచరణలో అమలుజరుగుటలేదు. మహిళలకు ఉద్యోగాలు దొరకడం కష్టం. దొరికినా వేతనాలు పురుషులకంటే ఎంతో తక్కువ.

అన్ని పెట్టుబడిదారీ దేశాలలో స్త్రీల అసమానతలు పోలేదు. అడ్డా-మగా విచక్షణ బాగా కన్పడుతుంది. అన్నివిధాలా ఆడది గనుకనే అన్యాయాలకు, అత్యాచారాలకు గురి అవుతున్నది.

అలవాటుగా చేసేపనులూ విసుగు పుట్టించే వుద్యోగాలూ ఆడవాళ్ళవి. మగవాళ్ళకి మాత్రం మానసిక శ్రమతో కూడిన(పోటీ) అవకాశాలుండే వుద్యోగాలు మగవాళ్ళ సొత్తె. ఇలాటి భేదం నాటుకు పోయిన సమాజంలో స్త్రీలను ఇంటి పనులను పోలిన కొన్నిరకాల వుద్యోగాలకే వుపయోగిస్తున్నారు.

ఇవి చిన్న వుద్యోగాలు - ఈ వుద్యోగాలుచేసే స్త్రీలపై అజమాయిషీ, అధికారి మగవాడే. ఆ అధికారహోదాతో కొంత మంది అధికారులు, పై ఉద్యోగినులపై అత్యాచారాలకు దిగడం, ఆ వుద్యోగినులు ఎదురుతిరిగి తిరగబడితే - వారిని బెదిరించి వుద్యోగాలనుండి తొలగించడంకూడా సాగుతుంది. ఆర్థిక దుర్భర పరిస్థితులలో - కుటుంబం బిడ్డలు పడుతున్న యాతనలతో వేరేగత్యంతరం లేక ఉద్యోగంపోతే కుటుంబం యావత్తూ ఆకలికి గురికావల్సి వస్తుందనే భయంతో ఇష్టం లేకపోయినా బిడ్డలకోసం ఆ అధికారులకు లొంగిపోతున్నారు కొంతమంది మహిళలు.

తమ బిడ్డల్ని కుటుంబాన్ని కాపాడుకొనే గత్యంతరం లేక వారిని బాధలకు ఆహుతిచేయలేక అధికారుల అత్యాచారానికి బలియై పోతున్న దౌర్భాగ్య స్త్రీలెందరో వున్నారు.

అందుకే ఇలాంటి వుద్యోగాలు చేయడానికి మనసొప్పక స్త్రీలుతప్పని సరై తేనేతప్ప, స్త్రీలు ఇంటిపట్టునేవుండి ఇంటిపనులు చేసుకోవడమే మంచిదనే ఆలోచనకు వస్తున్నారు. విరాళతో, నిస్పృహతో నిస్సహాయులుగా అన్నిటికీ మగవాళ్ళపైనే ఆధారపడుతున్నారు.

ఈపరిస్థితి నాధారంగా తీసుకొని స్త్రీలుఉద్యోగాలు చెయ్యరు. చెయ్యలేరు, చెయ్యగూడదు. మగవాళ్ళ అండలేనిదే ఆడవాళ్ళు బ్రతకలేరు అనేభావం సమాజంలో నాటుకు పోయింది.

బ్రెజిల్ దేశం పంపిన రిపోర్టులో ఇంకా ఇలా వుంది :

"క్రింది వర్గాల మహిళలలో తగినన్ని వుద్యోగాలు లేవు. జీతాలు సరిగా ఇవ్వరు. స్త్రీలకు సరైన విద్యా అవకాశాలు లేకపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

వీరు చిన్నచిన్న వుద్యోగాలుచేస్తూ హీనమైన వేతనాలతో సరిపుచ్చుకోవల్సి వస్తుంది.

నిపుణతా-తెలివి తేటలూ అవసరమైన వుద్యోగాలూ చేస్తున్న స్త్రీలకు అతితక్కువ జీతాలు ఇస్తున్నారు.

పురుషులతో సమానంగాచదువుకొని, సమానంగా పనిచేస్తున్న స్త్రీలకు పురుషులతోపాటు సమానంగా జీతాలు లభించటంలేదు.

బ్రిటనులోనూ ఇదే పరిస్థితి. పట్టభద్రులు అయి వుద్యోగాలు చేస్తున్న మహిళలలో 100 కి 40 మందికి ఏడాదికి 1750 పౌన్లు లేదా అంతకంటే తక్కువే జీతాలు లభిస్తున్నాయి.

అదే పట్టభద్రులైన పురుషులకు ఎంతో ఎక్కువ జీతం వుంటుంది.

కార్మికులలో చూస్తే పురుషులకు 1 గంట పనికి లభించే సగటు జీతంకంటే కార్మిక స్త్రీకి 40% తక్కువ. అన్ని పెట్టుబడిదారీ దేశాలలో పురుషులకంటే స్త్రీలకు ఈ క్రింది విధంగా తక్కువ శాతం జీతాలు వున్నవి :

బ్రిటన్‌లో ; 40; ఆస్ట్రేలియాలో - 24, బెల్జియంలో - 35, డెన్మార్కులో - 22, ఐర్లాండులో - 43, ఫిన్లాండులో - 28, స్వీడన్‌లో - 17, స్విజర్లండులో - 35, పశ్చిమజర్మనీలో - 30, జపాన్‌లో 52, ఫ్రాన్సులో 57.

1974లో అమెరికాలో పురుషుల వేతనాల్లో 58% మాత్రమే మహిళలకు జీతాలు లభించాయి.

శ్వేతేతర మహిళల వేతనాలు పురుషులకంటే 70 శాతం తక్కువ. ఆ మహిళలకు తక్కువ వేతనాలు చెల్లించటం ద్వారా 6300 డాలర్లు అదనపు లాభాలు అమెరికాలో ఒక్క సంవత్సరంలో వచ్చాయి.

పశ్చిమ జర్మనీలో పురుషులకంటే స్త్రీలకు తక్కువ జీతాలు ఇచ్చుటవల్ల సంవత్సరంలో 1000 కోట్ల మార్కులు అదనపు లాభాలు వీరికి వచ్చాయి. బ్రిటనులో 1700 మిలియన్లు (పౌన్లు) అధిక లాభాలు ఒకేసంవత్సరంలో ఆ ప్రభుత్వానికి వచ్చాయి.

ఆస్ట్రేలియాలో 645 కోట్ల డాలర్లు ఒకేసంవత్సరంలో అదనపు లాభాలు వచ్చాయి.

నిరుద్యోగులలో 40 శాతం పురుషులకంటె మహిళలు ఎక్కువగా వున్నారు.

ఎక్కువ భాగం మహిళలకు అర్హతలులేక, సాంకేతిక నిపుణత్వం లేకపోవడం. శాస్త్రవైజ్ఞానికి విద్యలు మరీతక్కువ. ఉద్యోగాల్లోనూ తక్కువ. అర్జెంటినాలో 26 శాతం - శ్రీలంకలో 10 శాతం. 1973 లో అమెరికాలో ఇంజనీర్లు 7 శాతంకంటే తక్కువ మహిళలు. ఫ్రాన్సులో 3.4%

దీనికి కారణం. అవిద్య - ప్రపంచ జనాభాలో 46 కోట్ల 89 లక్షలు మహిళలు నిరక్షరాస్యులు. భారతదేశంలో 60 కోట్ల జనాభాలో 37 కోట్ల మహిళలు నిరక్షరాస్యులు వున్నారు.

అందువల్లనే మహిళలు ఆయా దేశాల్లో రాజకీయ సాంఘిక జీవనాల్లో సరైనపాత్ర నిర్వహించే అవకాశం కలగటంలేదు. అనేక దేశాలలో యీనాటికీ మహిళల విద్యా విషయంలో వివక్షత చూపబడుతోంది.

సోషలిస్టు దేశాలలో ఎలాంటి వివక్షతలులేకుండా, విద్య ప్రాథమిక హక్కుగా అనేక అవకాశాలు కలిగించి నిరక్షరాస్యతను నిర్మూలించారు.

సమాజంలో అసమానతలు తొలగించిననాడే స్త్రీ పవిత్రంగా ఒక పవిత్రమైన గౌరవమైన వ్యక్తిగా గౌరవించబడుతుంది.

ఇది ఇప్పటికి సోషలిస్టు సమాజంలోనే సాధ్యమైంది.

అలాంటి సోషలిస్టు ప్రభుత్వాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున - శిశు సంరక్షణాలయాలు నడిపి పనులు చేసే స్త్రీలకు బిడ్డల సంరక్షణ పోషణ ప్రభుత్వమే చూసే అవకాశం కల్గించటం వలన, ఎంతో ఆనందంగా అక్కడి మహిళలు అన్నిరంగాలలో ముందుండి పని చేస్తున్నారు. వీరు విజ్ఞానం పెంపొందించుకొని, అన్ని బాధ్యతలు పురుషులతోపాటు నిర్వహించగలుగుతున్నారు. అలా దేశానికి స్త్రీల శక్తి సద్వినియోగపడుతుంది.

## స్త్రీ వుద్యోగినులు ఎదుర్కొంటున్న ప్రధానసమస్య

ఆఫీసులో పనిచేసే వేళల్లో తమ పసిబిడ్డల బాధ్యత – పెద్ద బాధాకర సమస్యగా తయారయింది తల్లులకు.

రెండు రకాల బాధ్యతల మధ్య నలిగిపోతున్న మహిళలకు శారీరక శ్రమగాక, మానసిక శ్రమ గూడా మితిమీరి పోయింది.

ఈ దుస్థితిలో మహిళలు ఇటు ఉద్యోగ బాధ్యతలూ అటు ఇంటిపనులూ గూడా సక్రమంగా చెయ్యలేక పోతున్నారు.

ఏక కాలంలో ఇద్దరు యజమానుల పూజిగం చెయ్యవల్సి రావడంలో అలసట – అనారోగ్యం–మనసులో బెంగ అసంతృప్తి, ఒక దానివెంట ఒకటి వారిని పట్టిపీడిస్తున్నాయి. దానితో భర్తనూ, పిల్లలనూ నిర్లక్ష్యం చేస్తున్నామనే మనోవ్యధతో క్రుంగిపోతున్నారు.

ఉద్యోగం చేస్తున్న మహిళలు తమ ఆశయాలను సాధించుకోలేక తాము కన్నకలలకూ, నిజజీవితంలో అనుభవాలకూ పొత్తు కుదరక బెంబేలు పడిపోతున్నారు.

తీరిక అనేది ఎరుగని ఈ వుద్యోగినులకి పిల్లలతోనూ, ఇంట్లోవున్న తక్కినవారితోనూ సంతోషంగా గడపడానికి వీలు చిక్కదు.

ఇంక సాంఘిక జీవనంలో వినోద కార్యక్రమాలలో పాలు పంచుకొనే అవకాశమెక్కడిది వీరికి పాపం?

అంతేకాదు మగవాళ్ళలాగా పైచదువులు – డిపార్టుమెంటు పరీక్షలు – వృత్తి శిక్షణలద్వారా ప్రమోషను సంపాదించడం – ఉద్యోగపరిస్థితులు మెరుగుపర్చుకోవడం యీ స్త్రీ వుద్యోగినులకు సాధ్యంగావడంలేదు. దీనితో వీరి సాంఘిక పురోభివృద్ధి కుంటుపడుతుంది. ఫలితం – గృహిణికి మానసిక సంక్షోభం. కుటుంబానికి అసౌకర్యం – అశాంతి.

సమస్యలయితే ఇంకాచాలా వున్నాయి. పురుషులకు అనుకూలంగా స్త్రీలకు ప్రతిబంధకంగావున్న యీ పరిస్థితి – యీ అసమానతను రూపమాపితేగాని సమాజం, దేశం బాగుపడదు.

బిడ్డలను పోషించడంలోనూ వారికి విద్యాబుద్ధులు గరపడంలోనూ తల్లిదండ్రులు – ముఖ్యంగా తల్లుల యొక్క పాత్రకున్న స్థానాన్ని సమాజం గుర్తించాలి. ప్రభుత్వం గుర్తించాలి.

అలాగే మహిళల విద్యకు బాగా ప్రోత్సాహమిచ్చి శాస్త్రీయ తదితరంగాలలో ఉన్నతవిద్య నభ్యసించడానికి ఆటంకాలు తొలగించాలి.

మహిళలు విద్యాభివృద్ధికై తమకున్న హక్కులు సక్రమంగా వినియోగించుటకు తగినటువంటి సామాజిక పరిస్థితులను వాతావరణాన్ని కలుగ చేయాలి. అపుడే మహిళలు పురుషులతో సమానంగా తమకున్నటువంటి సామర్థ్యాలను మేధస్సును ప్రతిభావంతంగా సాంఘికాభివృద్ధికి జయప్రదంగా వినియోగించగలరు.

ఉద్యోగాలుచేస్తున్న మహిళలసమస్యలు పరిష్కారం చేయాలంటే రెండు విధాలుగా కృషిజరగాలి. అందుకు మహిళా సంఘాలు వీరికి అండగా నిలబడి సమీకరించాలి.

మొట్టమొదటిది: ఇంటి పనులన్నీ ఆడవాళ్ల చేయాలన్న ధోరణి మారాలి. యీ మార్పు అవశ్యకతను గురించి బాలబాలికలందరికీ పసితనం నుండీ బడిలోనూ, బయట, పాటల ద్వారా సాహిత్యం ద్వారా, నాటకాలు, అనేక కళారూపాల ద్వారా సినిమా, రేడియో, టెలివిజన్, పత్రికల ద్వారా, సభలద్వారా పెద్దఎత్తున ప్రచారం దేశంలో జరగాలి. ఇంటిపనులూ, బిడ్డల సంరక్షణ, స్త్రీలు–పురుషులు సమానంగా పంచుకోవాలన్న అవగాహన మనస్తత్వం అందరిలో పెరగాలి.

రెండవ విషయం: ఉద్యోగినులకు, పనులు చేస్తున్న స్త్రీలకు తాము పనిచేసే వేళల్లో బిడ్డల సంరక్షణకు శిశుసంరక్షణ శాలలు, ఏ మహిళలు ఎక్కడ పనిచేస్తుంటారో అక్కడ తప్పనిసరిగా, ప్రభుత్వంగాని, ఆ అధికారులుగానీ, యజమానులుగానీ, ఏర్పాట్లు చెయ్యాలి.

వంటపని కొంతతగ్గించుకోడానికి వీలుగా తక్కువ ఖరీదులో తినుబండారాలు విక్రయించే అల్పాహార శాలలు, భోజన శాలలు సమిష్టిగా భోజనంచేసే కమ్యూన్లు వుండాలి.

తక్కువ టైములో ఇంటిపని, వంటలు పూర్తిచేసుకొనేందుకు మోడరన్ ఎక్విప్‌మెంటు (గ్యాస్‌స్టౌ, ప్రెషర్ కుక్కరు, గ్రైండింగు మిషన్లు) మొదలైనవి తక్కువ ధరలకు – సులభవాయిదా పద్ధతి చెల్లించేందుకు – కంట్రోలు ధరలకు ప్రభుత్వమే ఇప్పించాలి.

సంసార బాధ్యతలున్న స్త్రీలు చీకూ–చింతా లేకుండా పనులు బాధ్యతలు నిర్వహించేటట్లు అన్ని సదుపాయాలూ ప్రభుత్వం చెయ్యాలి. మహిళ లందరికీ యీ సౌకర్యాలతోపాటు రక్షణ ప్రభుత్వం కల్పించాలి.

### అన్నింటికంటే ప్రధానమైనది

ఈ వుద్యోగినులు – యీస్థితినుండి విముక్తి పొందాలంటే చైతన్యంతో – తమ ప్రయోజనాలను కాపాడుకోవాలన్న పట్టుదల దీక్ష వారికి ఉండాలి. వారికిజరిగే అన్యాయాలు ఐక్యతతో ఎదిరించి నిలబడాలి.

ఆ ధైర్యం, సాహసం – ఐక్యతాశక్తి–వారి సంఘాల సంఘటిత శక్తి పెంపొందించుకొంటూ మహిళా ఉద్యమంలో చేరి ఏక కంఠంతో స్త్రీ విముక్తికి పోరాడాలి.

వారి సమస్యల పరిష్కారానికి వారు చైతన్యంతో ముందుకు రాకపోతే వారి సమస్యలు అలాగే వుంటాయి.

తరతరాలుగా సమాజం స్త్రీలకు వేసిన దాస్య శృంఖలాలు త్రెంచుకొని తమ విమోచనకు, అభ్యుదయానికి ప్రతిబంధకంగా వున్న ఈ ప్రపంచాన్ని మార్చేందుకు ముందుకువచ్చిన నాడు వారికి అండగా దేశంలో 37 కోట్ల మహిళాలోకం నిలబడి సమస్యల పరిష్కారానికి తోడ్పడగలదు. ★

---

## ఓ బడి పంతులూ!

— శ్రీ గోపరాజు శ్రీగణేశ్వరరావు,
అత్కూరు, కృష్ణాజిల్లా.

డాక్టర్లూ....యాక్టర్లూ
లాయర్లూ....లీడర్లూ
నీవు పెట్టిన దీపాలే;
నీ శ్రమకవి ప్రతిరూపాలే;
కాని....
నీ బ్రతుక్కి మాత్రం లేదు దీపం;
అడుగడుగునా నీ మెతుక్కి శాపం;

స్థాపితం : 1939 సం॥ ఫోన్లు : 73467, 77052

# లక్ష్మీ జనరల్ స్టోర్సు

బీసెంటురోడ్డు, గవర్నరుపేట, విజయవాడ_2

నాణ్యము, మన్నిక, గ్యారంటీ రంగులుగల అన్నిరకముల వస్త్రములను మాత్రమే సరసమైన ధరలకు సప్లయి చేయుటలో ఆంధ్రదేశమునందు ప్రఖ్యాతి చెందిన ఏకైక సంస్థ.

గ్యారంటీ రంగులు నాణ్యమైన అసలు వెండి బంగారు జరీతో తయారు చేయబడిన డీలక్సు నంబర్ స్పెషల్ క్వాలిటీ కంచి, ధర్మవరం, బెంగుళూరు బెనారస్, అరణి పట్టుచీరలు 100% టెరినిన్, టెరికాటన్, దిగ్విజయ ఉలెన్ మిల్సు టెరీన్, టెరీవూల్ షర్టింగులు, కోటింగులు సప్లయి మా ప్రత్యేకత ఒ.సి.యం. మిల్సు.

తక్కువ ధరలను చూచి నకిలీ రకములను కొని మోసపోకండి. నేత చీరెలు రంగుపోయినచో వాపసు

## లక్ష్మీ డిపార్టుమెంటు స్టోర్సు ఫోన్ : 75033

బీసెంటురోడ్డు, గవర్నరుపేట, విజయవాడ_2

అత్యుత్తమమైన ఆహారపదార్థములను సేకరించి పరిశుభ్రముగా బాగుచేయించి ప్రజానీకమునకు సప్లయి చేయవలెననే మహదాశయముతో ప్రారంభింపబడి ప్రజల మన్ననలను పొందుతూ దిగ్విజయంగా నిర్వహించబడుతున్న ఆంధ్రదేశమునందలి మొట్టమొదటి డిపార్టుమెంటుస్టోర్.

నాణ్యమైన వస్త్రములు, పట్టుచీరెలు, టెరిలీన్సు, టాయిలెట్లు, ఫ్యాన్సీ సామానులు వగైరా లభించును.

నాణ్యతకు, నమ్మికకు, శుభ్రతకు ప్రఖ్యాతి చెందినది. విజయవాడ వచ్చినప్పుడు తప్పక మా షాపునకు దయ చేయండి.

## లక్ష్మీ షోరూమ్ ఫోన్ : 77055

బీసెంటురోడ్డు, గవర్నరుపేట, విజయవాడ_2

ఆంధ్రదేశములో మిక్కిలి పెద్దదైన ప్రత్యేక ఆధునిక బిన్నీ బట్టల షాపు.

నాణ్యములో, మన్నికలో, రంగుల గ్యారంటీలో, ధర సరసత్వములో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అన్ని రకముల బిన్నీ వస్త్రములు మావద్ద కోకొల్లలుగా మిల్లువారి చేతను, ప్రభుత్వము వారి చేతను నిర్ణయింపబడిన కంట్రోలు ధరలకు లభించును.

స్కూలు పిల్లల యూనిఫారములకు కావలసిన అన్ని రకముల వస్త్రములను లభించును.

కాకిడ్రిల్లు, బ్లూడ్రిల్లు, తెలుపుడ్రిల్లు రకముల స్టాఫ్ యూనిఫారముల నిమిత్తము పెద్దమొత్తములు సప యి చేయగలము.

## లక్ష్మీ సిల్కు హౌస్

రామచంద్రరావు రోడ్డు, సూర్యారావుపేట, విజయవాడ.

విజయవాడ గవర్నరుపేట తూర్పు ప్రాంతవాసులకు అందుబాటులో వుండుటకే భారీ ఎత్తున నూతనముగా ప్రారంభింపబడిన ఆధునిక ఫాషన్ వస్త్రములషాపు, అన్నిరకముల నాణ్యమైన గ్యారంటీ కల మిల్లు, చేనేత, సిల్కు, రిలీన్, పోలియస్టర్, వులెన్, టెరివూల్ వస్త్రములు రిటైలుగాను, హోల్‌సేల్‌గాను సరసమైన ధరలకు లభించును.

## M/s. శిష్టా లక్ష్మీపతి శాస్త్రి (ఫరం) ఫోన్ : 77052 Extn.

లక్ష్మీ జనరల్ స్టోర్సు మేడమీద 2వ అంతస్థులో

బ్రాంచి : కాంగ్రెసు ఆఫీసురోడ్డు, విజయవాడ_2

మావద్ద స్త్రీల డ్రెస్ మెటీరియల్ రకములు, రూబియా లాన్స్, ప్రింటు లాన్సు, చికెన్ ఫుల్‌వాయిల్స్ సెల్ఫ్ డిజైనులుగల చికెన్ లాన్సు, పిల్లల రెడీమేడ్ గౌన్లు, ఫ్రాకులు, బాబా సూట్లు, గ్లాస్కో మల్లులు — గ్యారంటీ రంగులు కలవి సరసమైన ధరలకు లభించును.

పిల్లల స్కూలు యూనిఫారము బట్టలు అన్ని స్కూళ్ళవి విరివిగా లభించును.

# ప్రశ్నోత్తరాలు

**జి. సూర్యనారాయణ, పాలకొండ, శ్రీకాకుళం**

ప్రశ్న: ఫామిలీ పెన్షన్‌ను పుచ్చుకొంటున్న ఒక చనిపోయిన టీచరు భార్య తన కుటుంబ పెన్షన్‌లో ⅓ కమ్యూట్ చేసుకొనవచ్చునా?

జవాబు: కుటుంబ పెన్షన్ కమ్యూట్ చేసుకొనుటకు వీలులేదు.

**బి.యస్. కాశీవిశ్వేశ్వరరావు, యేడిద, తూ.గో.**

ప్రశ్న: జి.వో.యం.యస్. నెం. 888 తేదీ 25-8-77 ప్రకారం అప్‌గ్రేడు చేసిన బి.ఇడి ఉపాధ్యాయులకు, ఇతర బి.ఇడి. ఉపాధ్యాయులకున్న సౌకర్యాలు వర్తించునా?

జవాబు: అన్ని విషయాలలోను ఇతరులు, వారు సమానులే. అన్ని సౌకర్యాలు వర్తించును.

**శ్రీ జి. యస్. ప్రసాదరావు, పాలకొల్లు, ప. గో.**

ప్రశ్న: హెడ్‌మాష్టరు డ్యూటీ అలవెన్సుపై డి. ఎ. రు. 300- రు. 400- మధ్య వేతనం పొందువారికి వర్తించదని, మిగతా వారికి వర్తించునని అంటున్నారు? ఎంతవరకు నిజం?

జవాబు: నిజమే రు. 300-లోపు రు. 400- లు పైబడిన వారికి మాత్రమే డ్యూటీ అలవెన్సుపై డి ఎ. లెక్కించబడును.

**శ్రీ బి. నారాయణరావు, అలంపూర్**

ప్రశ్న: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రిటయిరుమెంటు వయసు 58 సంవత్సరాలు పెంచుటకు సుముఖంగా వున్నదంటున్నారు నిజమా?

జవాబు: ప్రభుత్వము ఏదీ తనంత తానుచేయదు. బలమైన ఉద్యమాల ద్వారానే అవిసాధించబడతాయి. అందుకే యు.టి.యఫ్. అసెంబ్లీ ముందు ప్రదర్శన తలపెట్టింది.

**యస్. మురహరి శర్మ, పెద్దగంజాం, గుంటూరు**

ప్రశ్న: బాల్వాడి ట్రయినింగు పొందిన వారికి యేస్కేలు యిస్తున్నారు. ఈ పాఠశాలలు ఎక్కడగలవు.

జవాబు: బాల్వాడి టీచర్లకు సెకండరీ స్కేలు యిచ్చుటకు ప్రభుత్వము అంగీకరించింది. ప్రతి పంచాయితి సమితిలో పాఠశాలలు గలవు.

**మల్లంపాటి వీరబ్రహ్మం, దండమూడి, గుంటూరు**

ప్రశ్న: పిల్లలవిద్యా సౌకర్యములకు ఆదాయపరిమితిఎంత? భార్యాభర్తలు ఉద్యోగస్తులయిన ఇద్దరి ఆదాయాలు లెక్కలోనికి వస్తుందా?

జవాబు: షెడ్యూలు తరగతులకు, వెనుకబడిన తరగతులకు ఆరువేల లోపు వరకు ఆసౌకర్యములు వర్తించును. అన్ని కులాలకు సదరు సౌకర్యమువర్తింపజేయుటకు విద్యామంత్రిగారు అంగీకరించిరి. కాని యింకను ఉత్తర్వులు రాలేదు. భార్యాభర్తల మొత్తం ఆదాయాలు లెక్కింపబడును.

**టి. వెంకటసుబ్రహ్మణ్యశర్మ,**
గుడిపాటిపల్లి ప్రకాశం జిల్లా.

ప్రశ్న: నేను ఎయిడెడ్ స్కూలులో పనిచేయుచు టేకోవర్ అయి సమితికి మారితిని. తిరిగి విద్వాన్ పాసయినందున ఎయిడెడ్ స్కూలుకు వెళ్ళితిని. నేను 55 తర్వాత కంటెన్యూ అయ్యే అవకాశంవుందా? నేను సమితిలోవుండగా కట్టిన పి.యఫ్ కు వడ్డీ ఇవ్వనంటున్నారు నిజమా? నేను ఇంతవరకు ఏవిధమైన శలవు పెట్టలేదు. రిటైరైనతరువాత సదరు శలవుకు జీతం పొందవచ్చునా?

జవాబు: ప్రస్తుత ఉత్తర్వులు ప్రకారం కంటెన్యూ అయ్యే అవకాశములులేవు. వడ్డీ యివ్వననివుండరు. బోనసు అయితే ఇవ్వనవి వుండవచ్చు, రిటయిరయిన తరువాత శలవుకు జీతం పొందే సౌకర్యం ఇంతవరకు ప్రభుత్వేతర ఉపాధ్యాయులకు లేదు. అందు గురించి కృషి జరుగుచున్నది.

**ఎ. నరసింహమూర్తి, సీతంపేట, ఖమ్మం.**

ప్రశ్న: 1961-73 సం॥రంల మధ్య రిటైరైన ఉపాధ్యాయులకు మినిమంపెన్షన్ రు. 45/-లు ఇచ్చుటలేదు కారణమేమిటి?

జవాబు: జి. వో. యం. యస్. నెం. 739 తేది 7-7-78 ప్రకారం ప్రభుత్వం 1961-73 మధ్య రిటైరయిన వారికి మినిమం పెన్షన్ రు. 45/- ఇవ్వాలని ఉత్తర్వు యిచ్చింది. సదరు ఉత్తర్వు యిదే పత్రికలో ప్రకటించాము, పరిశీలించండి.

**దబులెమ్మె, అమలాపురం, తూ.గో.**

ప్రశ్న: నా అవసరానికి సరిపడునంత జీతం ప్రభుత్వం యిచ్చుటలేదు, కారకులెవరు?

జవాబు: మీరే. చైతన్యస్థాయి, పోరాటశక్తినిబట్టియే పరిస్థితులు వుంటాయి. "ఎంతచేసుకున్నవాడి కంత" అన్న ఆర్యోక్తి వినలేదా।

★

## తాళ్ళరేవు సమితి శాఖ

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తాళ్ళరేవు సమితిశాఖ కమిటీ సమావేశం ది. 22-7-78 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ యం. శ్రీరాములుగారి అధ్యక్షతన తాళ్ళరేవులో సమావేశమైనది. ఈ క్రింది తీర్మానములు చర్చించి ఆమోదించడమైనది. శ్రీ అబ్దుల్ రహమాన్ ప్రధాన కార్యదర్శి నివేదికపై చర్చించి ఆమోదించిరి.

అదనపు అర్హతలుగల ఉపాధ్యాయులకు శాంక్షను చేయబడిన ఇంక్రిమెంట్లు ఎరియర్సు వెంటనే ఉపాధ్యాయులకు ఇప్పించవలెను. యస్.డబ్ల్యు. స్కూల్సు కేర్ కంటిజెంట్సు ఇప్పించవలెను.

పాఠశాలల కవసరమగు స్టేషనరీ సప్లై చేయవలెను

శ్రీ ఎ. వెంకట్రావు (శీలలంక) గారి ఊస్టింగు పిరియడుకు జీతము ఇప్పించవలెను శ్రీ పి.సూర్యారావు (జగన్నాధగిరి) పేఫికేషను చేయవలయును తిరిగి నియమింపబడిన కంపల్సరీ రిటయిర్డు ఉపాధ్యాయులకివ్వవలసిన జీతభత్యములు ఎరియర్సు ఇప్పించవలయును.

ఈ విషయములపై మండల వికాసాధికారిని అదేరోజు కలిసి చర్చించిరి. ప్రతినిధి వర్గములో శ్రీయుతులు యం. శ్రీరాములు, ఎ. రహమాన్, బి. గురువులు, కె. ఏసుదాసు, కె. ద్రోణాచార్యులు గార్లు పాల్గొన్నారు.




# తలకు గాయాలు

డా॥ యం. రామారావు, యం.బి బి.యస్.

ప్రజావైద్యశాల - విజయవాడ

మోటారు సైకిలు, మోటారుకారు ప్రమాదాలలో, తలకు గాయాలు హెచ్చుగా తగులుతాయి. పరిశ్రమల్లో ఆటల్లో ఇళ్ళవద్ద జరిగే ప్రమాదాల్లోకూడా తలకు గాయాలుతగలవచ్చు. తల గాయాలు చాలా ప్రమాదకరమైనవిగా, ప్రాణాంతకంగా వుంటాయి. అందువల్లే ఈ ప్రమాదాల నివారణకు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవటం అవసరం ఎంతైనావుంది. ఈమధ్య విజయవాడలోను, ఆంధ్రదేశంలోనూ రోజూ ప్రమాదాలు మామూలైపోయాయి. ఈ ప్రమాదాలకు కారణాలేమిటి వాటిని నివారించడమెలా అన్న విషయాన్నికూడా ఈ సందర్భంలో విశ్లేషించటం అవసరం.

ఆల్కాహాలు సేవించటం, అతివేగంగా బండ్లు నడపడం ఇందుకుముఖ్యమైన కారణాలుగా గుర్తించబడ్డాయి పాశ్చాత్య దేశాలలో. మన దేశానికి సంబంధించినంతవరకూ ఇవి ముఖ్యమైన కారణాలుగా పేర్కొనేందుకు అవకాశంలేదు. మన రోడ్లు వాటిని మనం వుపయోగించుకొనే తీరు మన పట్టణానికి మన రాష్ట్రానికి సంబంధించినంతవరకూ ముఖ్యమైన కారణంగా పేర్కొనవచ్చు.

మనరోడ్లు అధ్వాన్నంగా వుంటున్నాయి. ఇవ్వాళ రోడ్డు వేస్తారు. రేపు డ్రైనేజి గుంట తవ్వుతారు. గుంట త్రవ్వటానికి ఒకరోజేపట్టినా పూడ్చటానికి నెలరోజులు పడుతుంది. పూడ్చి నెలగడిచేసరికి అక్కడొక గుంట ఏర్పడుతుంది. అది పూడ్చటానికి మరో పంచవర్ష ప్రణాళిక రావలసిందే. ఏ గుంటలోనూ పడకుండా, రోడ్డుకి ఎడమవైపునే పోవాలన్న నియమం పాటించటం, మోటారు వాహక చోదకుడు ఎంతప్రవీణుడైనా విజయవాడలో సాధ్యంకాదు. ఈ రోడ్లే అనేక (1/3) ప్రమాదాలకు కారణమని చెప్పుకోవచ్చు.

రోడ్డుప్రక్కన నడిచేందుకు పేవ్ మెంట్లు లేకపోవడంవలనా రోడ్డుప్రక్కల గుంటలు, గోతులు, మురుగు మూత్రాలతో అపరిశుభ్రంగా వుండటంవలనా- అన్నింటికీమించి అలవాటు లేకపోవటం వలనా చాలమంది రోడ్డుమధ్యన మాత్రమే నడుస్తారు. రోడ్డు క్రాస్ చేయడానికి ప్రత్యేకమైన చోట్లు గుర్తించబడి లేకపోవటం వల్ల ఎక్కడచూచినా రోడ్డుకడ్డంగా నడిచేజనులు కొల్లలు. సైకిళ్ళవాడే వారికి చాలామందికి రోడ్డురూల్సు తెలియకపోవడం వల్ల వాళ్ళు ఎక్కడ ఎటుతిరుగుతారో ఊహించేదీ కష్టమే అవుతుంది మోటారు చోదకునికి. (సైకిలు అమ్మేటప్పుడు సైకిలుతోపాటు రోడ్డురూల్సు వున్న పుస్తకం ఇవ్వడం మంచిదేమో?) వీటన్నిటకి మించి రోడ్డు మీదపోయే పౌరుగువానికి చోటివ్వాలని, రోడ్డుమధ్య వేగంగాపోయే వాహనాలకు అవకాశంఇవ్వాలన్న జ్ఞానాన్ని మనమందరం పెంపొందించుకొనటం అవసరం. రోడ్డుమీద దుకాణాలు మరో అడ్డం. పోలీసులు ప్రభుత్వం పైవిషయాలలో తగినంత శ్రద్ధ చూపితే రోడ్డు ప్రమాదాలను చాలావరకు నివారింపవచ్చు.

తలకు దెబ్బ తగిలినప్పుడు ఈక్రింది భాగాలు గాయపడవచ్చు. 1. తలపైనున్న చర్మము దానిలోని నరాలు 2. పుర్రె ఎముకలు పగలవచ్చు. పగిలిన ఎముకలు బయటికి రావటం కాని, లోపలికిపోయి మెదడునుగాయపర్చటంగానీ జరగవచ్చు,3.మెదడుపైనున్న పొరలు చిరగవచ్చు. 4. మెదడుకే దెబ్బ తగలవచ్చు. మెదడుపై వత్తిడిగానీ వాపుగానీ రావచ్చు. 5. మెదడుతో పాటు వున్న రక్తనాళాలు చిట్లవచ్చును. 6. మెదడు నుండి వచ్చే నరాలు దెబ్బ తినవచ్చును. 7. తలతోపాటు కన్నూ, చెవి, ముక్కూ, మెడ ఎముకలు కూడా దెబ్బ తినవచ్చు.

**ప్రథమ చికిత్స :** గాయాలనుండి రక్తం చిమ్ముతూంటే సుభ్రమైన గుడ్డతో గాయంపై నొక్కిపట్టి వుంచటంగానీ, కట్టు కట్టటంగానీ చేయాలి. రోగికి శ్వాస బాగాఆడేట్లు చూడాలి. అప్పుడు దగ్గరలోవున్న ఆసుపత్రికి తరలించాలి.

దెబ్బ ఎలాతగిలింది, దెబ్బ తగిలినవెంటనే రోగి స్పృహలో వున్నాడా ? దెబ్బ తగిలి ఎంతసేపైనది ? ఈ మధ్యకాలంలో రోగి పరిస్థితిలో (స్పృహలో) వచ్చిన మార్పుఏమిటి ? అన్న విషయాలు డాక్టరుకు చెప్పటం అవసరం.

**లక్షణాలు :** రోగిపూర్తిగా స్పృహలోవున్నాడా,మగతగా వున్నాడా, సాంతం స్పృహకోల్పోయాడా, తట్టిలేపినప్పుడైనా మేలు కొన్నాడా లేదా అన్న విషయాలు డాక్టరు ముందుగా చూస్తారు. కనుపాపలు సరిగావున్నవాలేవా? అన్నవిషయం నాడి,రక్తపోటు, శ్వాస, జ్వరము చూస్తారు. తల గాయాలతోపాటు మరేవైనా గాయాలున్నాయేమో చూడటంకూడా అవసరం. తరువాత అవసరమైతే ఎక్సురే.

తల ఎముకలు చిట్లినా రోగి మగతగావున్నా, మెదడులో ఒకభాగం దెబ్బతిన్న లక్షణాలు కనిపించినా హాస్పిటల్లోవుంచి జాగ్రత్తగా చూడవలసిన అవసరంవుంది. తరచుగా రోగిపరిస్థితిని పునరాలోచించవలసివుంటుంది. స్పృహక్రమంగా కోల్పోవటం, నాడివేగం హెచ్చటం, రక్తపోటు తగ్గటం లేక హెచ్చటం చెడు లక్షణాలు రోగిపరిస్థితి ప్రమాదకరంగా మారుతున్నదనటానికి చిహ్నాలు. రోగిపరిస్థితి త్వరగా క్షీణిస్తూవుంటే వెంటనే తలపై ఆపరేషన్ చేయవలసి వుంటుంది.

**చికిత్స:** తలకు గాయాలైన రోగికి మత్తు పదార్థాలు ముఖ్యంగా 'మార్ఫియా' లాటివి ఇవ్వరాదు. రోగి స్పృహ కోల్పోయినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు: శ్వాస స్వేచ్ఛగా ఆడేట్లు చూడాలి. శ్వాసనాళం ఫ్రీగా వుండేందుకు అవసరమైతే తల వెనుకకు వంచటం, నాలుక ముందుకు లాగటం చేయాలి. స్పృహలేని రోగి యేమీ తీసుకోలేదు కాబట్టి, అతనికి కావలసిన ఆహారము, నీరు, మొదట్లో సరైన గ్లూకోజు సీసాల ద్వారాను, తరువాత రబ్బరు ట్యూబు ద్వారానూ యివ్వవలసి వుంటుంది.

రోగిమూత్ర విసర్జన చేయలేకపోవచ్చు; చేసినా పక్కబట్టలు కరాబు చేయవచ్చు.అందువల్ల రబ్బరు గొట్టంద్వారా మూత్రం తీయటానికి ఏర్పాటు చేయవలసి వుంటుంది.

స్పృహలేని రోగిని మనం ఏ పొజిషన్‌లో పరుండబెడితే

అస్థితిలోనే వుండిపోతాడు. అందువల్ల శరీరంలోని కొన్ని భాగాలకు ఎక్కువ వత్తిడి ఏర్పడి పుళ్ళు పడవచ్చు. దానిని నివారించటానికి రోగిని తరచు ప్రక్కలకు త్రిప్పటము, చర్మం పొడిగావుంచటము అవసరం.

మెదడులోని ఉష్ణోగ్రత కంట్రోలుచేసే కేంద్రాలు దెబ్బ తినటంవల్ల వేడి అధికంగాపెరిగే అవకాశంవుంది. దానివల్ల మెదడుకు ఎక్కువ ఆక్సిజన్ కావలసివస్తుంది. మెదడు వాపుకూడా రావచ్చు. మందులవల్ల, చల్లని నీటితో శరీరాన్ని తుడవటం, కప్పటంద్వారా శరీరోష్ణోగ్రతను తగ్గించటం అవసరం. మెదడుపై వత్తిడి యేర్పడినప్పుడు స్పృహ మరింత క్షీణించటం, ప్యూపిల్సు మొదట్లో చిన్నవికావటం, తరువాత మరింత పెద్దవికావటం, లైటుకు రియాక్టు కాకపోవటం, రక్తపోటు పెరగటం, నాడి నిదానించటం, శ్వాసక్రమం తప్పటం, శరీరంలో కొంతభాగం శక్తిహీనం కావటం జరుగుతుంది.

మెదడులో రక్తనాళాలు చిట్లటంద్వారా వెలువడిన రక్తం గడ్డక్రమంగా పెద్దదై మెదడుమీద వత్తిడి పెరగటంవలనగానీ, మెదడువాపు రావటంవలనగానీ చిట్లిన ఎముకలు లోపలికి నొక్కుకోవటం వలనగానీ మెదడుపై వత్తిడి ఏర్పడవచ్చు.

మెదడులో రక్తనాళాలు చిట్లటంవల్ల రక్తస్రావం జరగవచ్చును. పుర్రెఎముకను అనుమానంవున్న భాగంలో ఆపరేషన్‌చేసి గడ్డకట్టిన రక్తం తీసివేసి రక్తస్రావాన్ని ఆపవలసివుంటుంది.

మెదడువాపు రావటంవల్లకూడా రోగి పరిస్థితి క్షీణించవచ్చును. మెదడులో ఏదైనా ప్రత్యేక భాగం దెబ్బతిన్న లక్షణాలు కనిపించకుండా రోగిస్థితి క్షీణిస్తున్నపుడు మెదడువాపు కారణం కావచ్చు.

కార్టిజోన్ ఇవ్వటంద్వారా ఈ మెదడు వాపును కంట్రోలు చేయవచ్చును. 6 గంటలకొకసారి **Denamethasore 4 mg** ఇవ్వవల్సివుంటుంది. **Manitol** గానీ **Fursenide** గానీ ఇవ్వటంద్వారా కూడా మెదడువాపు తగ్గించవచ్చు (వీటిని **Dimetics** అంటారు) వీటిప్రభావం తగ్గినతరువాత మరల మెదడువాపు ప్రారంభంకావచ్చు అందువల్ల ఆపరేషనుకు ముందు మాత్రమే వీటిని వుపయోగిస్తారు.

తలకు గాయమైనప్పుడు దానిలో సూక్ష్మక్రిములు చేరటం వల్ల **infection** కావచ్చును. మెదడుకుగానీ(**Encephalitis**)మెదడు పైనున్న పొరలకుగానీ(**Meningitis**) పుర్రెఎముకకుగానీ (**Ostomylitis**) ఈ **infection** సోకవచ్చు. యాంటిబైయాటిక్సు తగిన మోతాదులో మొదటినుండి వాడుటద్వారా దీనిని నివారింపవచ్చును.

పుర్రె ఎముక చిట్లి ఒక భాగంలోనికి నెట్టబడి మెదడుపై వొత్తిడి హెచ్చుకావచ్చును. అప్పుడు ఆపరేషన్‌ద్వారా ఆ ఎముక పైకితేవలసి వుంటుంది. ఎముక కొంచెం చిట్లితే పైనున్న చర్మానికి కుట్లువేస్తే సరిపోతుంది. పుర్రె అడుగు భాగంలోని ఎముకలు చిట్లి మెదడుపైనున్న పొర చిరగటం వలనే ముక్కు లేక చెవులగుండా **C. S. F.**(మెదడు, వెన్నుపాముల చుట్టూవుండే ద్రవము) కారుతూ ఉండవచ్చును.

ఈ సి.యస్.యఫ్. కారటం 2_3 వారాలలో ఆగిపోకపోయినా మెదడుపైనున్న పొరలకు చీముపట్టిన లక్షణాలు కనిపించినా ఆపరేషన్ చేయవలసి వస్తుంది.

తలకు చిన్న లేక తీవ్రంకాని గాయాలు తగిలి రోగి వొకటి నుండి వారం రోజులవరకు మగతగా వున్న సందర్భాలలో తలనొప్పి; తూలు, వొకవిషయం మీద కేంద్రీకరించలేకపోవటం, వెనుకటి విషయాలు గుర్తున్నా అప్పటి విషయాలు మర్చిపోవటంలాంటి లక్షణాలు కనిపించవచ్చు. అప్పుడు(**Encephabol**)విటమిన్సువాడటం మంచిది. అలాటప్పుడు రోగి మామూలు స్థితికి రావటానికి 2_3 సంవత్సరాలు పట్టవచ్చు. తలకు తీవ్రమైన గాయాలు తగిలినప్పుడు వ్యక్తిత్వంలోను, తెలివితేటల్లోనూ మార్పు రావచ్చు. మెదడుకు గాయాలు తగిలిన సందర్భాలలో గాయాలు మానిన తరువాత 'ఫిట్సు' వచ్చే అవకాశం వుంది. ★




# గ్రహాల పుట్టుక

సేకరణ : స్వామి

పంచ భూతములైదురా - ప్రపంచమాయెను చూడరా! అని ఎవరో తత్వాలు పాడగా వినియుంటారు. అసలు భూతాలు (ధాతువులు) ఐదు కాదు. 92 వున్నాయి. హైడ్రోజన్, ఆక్సిజన్, ఇనుము, రాగి, వెండి, బంగారము, యురేనియం మొదలగునవి. అణువుల కలయికచే ధాతువులు ఏర్పడ్డాయి. ధాతువుల కలయికచే గ్రహాలు ఏర్పడ్డాయి.

నాలుగులేక ఐదుకోట్ల సంవత్సరాల క్రిందట నక్షత్ర సముదాయాలతో కూడిన గెలాక్సెలన్నీ ఒకేచోటకు ఒకముద్దగా చేరాయని, ఆ బ్రహ్మాణువు ప్రస్తుతం సౌరకుటుంబం ఆవరించినంత మేరవుండి వుంటుందని, అప్పుడు నక్షత్రాలులేవు, అణువులులేవు. అవి ప్రొటాన్లు, ఎలక్ట్రాన్లుగా విడిపోయివుండాలి. చివరకు న్యూట్రాన్లే మిగిలి వుండాలి. ఆ స్థితిలో అది బ్రద్దలై అన్నివైపులకు దాని ముక్కలు ఎగిరిపోయివుండాలని, అప్పుడే ధాతువులు, నక్షత్రాలు ఏర్పడి దూరంగా పయనిస్తూవున్నాయని కొందరి వాదన.

విశ్వం అలా విస్తరిస్తూ పోయిపోయి చివరికి విస్తరణ ఆగిపోయి, తిరిగి ముకుళించుకొని పోతుందని, ఒక బ్రహ్మాండమైన అణువుగా చేరి తిరిగి బ్రద్దలవుతుందని, ఇలా అనంతకాలం జరుగుతుందని కొందరి వాదన. మరికొందరు అసలు విశ్వం విస్తరించటం లేదని కొన్ని వందల కోట్ల ఏండ్లనాడు వాటినుండి బయలుదేరిన కాంతి యిప్పుడు మనలను చేరుతుంది కాబట్టి మనము అలా భ్రమిస్తున్నామంటున్నారు.

నక్షత్రాల మధ్యగల శూన్య ప్రదేశంలో శక్తి వున్నదని,

# ఆగస్టు పదిహేను

— గుట్టాల లక్ష్మారెడ్డి, కల్వకుర్తి.

అదిగో అల్లదిగో చూడు
ఇదిగో మళ్ళీదిగో నేడు
వచ్చెను ఆగస్టు పదిహేను
తెచ్చెను జాతి ప్రతిష్ఠకొని తాను!
ప్రతి సంవత్సరం వస్తూనేఉంది ఈ దినం
సభలు - సమావేశాలు చేస్తూనేఉన్నాం అందరం
వీధివీధుల్లో పతాకాలు కడుతూనేఉన్నాం
వాడ-వాడల్లో విగ్రహాలు పెడుతూనేఉన్నాం!

కులాల వ్యవస్థను కూల్చేస్తామని
మతాల కీతాబుల కాల్చేస్తామని
ఉపన్యాస విన్యాసాలను చేస్తూన్నాం
మొసలికన్నీటితో జనాన్ని బుజ్జగిస్తూన్నాం!

సభలు సమావేశాలు బాహాటంగా జరుపుకుంటున్నాం
ఆచరణలోబెట్టని కార్యాలెన్నిజేస్తే ఏమిటి లాభం?
తాడిత పీడిత జనాన్ని తనలోకి లాక్కుంటూనే వుంది
అస్తవ్యస్త వ్యవస్థపు అంతులేని అగాధం!

త్రివర్ణ పతాకాలు ఉవ్వెత్తున ఎత్తడం
త్రికరణశుద్ధిలేని ప్రసంగాలు చేయడంతప్ప
మనం సాధించింది ఏముంది ఈ
ముప్పది సంవత్సరాల్లో చెప్ప!

అన్నార్తులకు ఆకలితీరిందా?
ఉద్యోగులకు ఊరట కలిగిందా?
ఆకాశాన్నంటే ధరలు దిగివచ్చాయా?
పేదల కన్నీళ్ళను తుడిచే నవ
వేదాలేమైనా పుట్టుకొచ్చాయా? వారి
బాధల గాధలనేమైనా నెట్టుకొచ్చాయా?

వీధి వీధుల్లో విగ్రహాలు బెట్టి
వినువీధుల్లో పతాకాలు కట్టి
ఉపన్యాస విన్యాసాలు చేపట్టి
ఎంత తతంగంచేస్తే ఏమిటి లాభం?

ధనవంతుడు హిమవంతుడిలా
పెరిగిపోతూనే ఉన్నాడు
దరిద్రుడు కలిమిలేముల కడలిలో
దారితెన్ను గానక మునిగిపోతూనే ఉన్నాడు!

అందుకే పురాతన సాంప్రదాయంలా
ముందుకేపోతూ స్వాతంత్ర్య దినోత్సవం
నడిపించటంగాదు అగుపించడంగాదు
మనకు కావల్సింది మనం కోరుకోవాల్సింది!

సరియైన నిర్ణయాలు చేబట్టి
వానిని ఆచరణ మార్గంలోబెట్టి
మమతాను రాగాలను పండించే
సమతా దీపాలను వెలిగించే
సమైక్యతా రామరాజ్యాన్ని తెచ్చే

ఓ సరికొత్త ఆగస్టు పదిహేను
పర్వదినం రావాలి మనకు కావాలి
అది అందరి పచ్చని బ్రతుకుల్లో
నులివెచ్చని మంగళ హారతులివ్వాలి!

అవి అణువులుగా నిర్మాణము పొంది, వాయుపదార్థంగా సమీకృతం అవుతాయని, ఆ వాయు పదార్థం చిన్నమేఘాలా ఆకారాన్ని పొందినపుడు వత్తిడి పెరిగి, వేడిపుట్టి నక్షత్రంగా తయారవుతున్నాయని కొందరి వాదన.

మండుతున్న నక్షత్రాలనుండి కొన్ని శకలాలు రాలి గట్టిపడి గ్రహాలుగా ఏర్పడి ఆ నక్షత్రంచుట్టూ తిరుగుతున్నాయని, అలాగే సూర్య కుటుంబం ఏర్పడిందని చెపుతారు.

సూర్యుని నుండి విడిపోయిన శకలాలు గ్రహాలుగా ఏర్పడ్డాయని, వాటిలో కొన్ని ఉపగ్రహాలుగా ఏర్పడ్డాయని, అసలు యీ గ్రహాలు ముందు మండుతూవుండి క్రమేణా పైభాగం చల్లారి నేటి స్థితికి వచ్చాయని లోన ఇంకా వేడివుందని చెబుతారు. మొత్తానికి చల్లబడితే చంద్రునిలా తయారవుతాయా! లేక గ్రహాలలోవున్న వేడి రానురాను పైకివస్తే సూర్యునిలా మండుతాయా! అప్పుడు ప్రాణికోటి ఏమికావాలి? అన్నదే ప్రశ్న.

సూర్యుడు నిత్యం మండుతూ ప్రతి సెకనుకు 40 లక్షల టన్నుల శక్తి కోల్పోతున్నాడు. అంటే అంతబరువు తగ్గుచున్నాడు. అయినా కొన్నివందలకోట్ల సంవత్సరాలకు సరిపడా శక్తిసూర్యునిలో వున్నది. ఇలా అన్ని నక్షత్రాలు తమ శక్తిని కోల్పోతూ వున్నాయి.

కొన్ని వేలకోట్ల సంవత్సరాలనాడు ఈ విశ్వం పుట్టింది. మరికొన్ని వేలకోట్ల సంవత్సరాలకు అది నశిస్తుంది. అప్పుడు నక్షత్రాలు, గ్రహాలు, వేడి, కాంతి, జీవము ఏదీ వుండదు అంతా శూన్యం అని శాస్త్రజ్ఞులూ చెపుతున్నారు.

అయినా ఆ స్థితి రావాలంటే 500 వేలకోట్ల సం॥రాలు పట్టవచ్చు. లేక విజ్ఞానం మనం ఊహించని మలుపు తిరిగి, అది నివారింపబడవచ్చు: వేడికోల్పోయిన సూర్యుని స్థానంలో కృత్రిమంగా వేడిని సృష్టించవచ్చు. ప్రాణికోటి మనుగడ ఆపైన కూడా సాధ్యం కావచ్చు. విజ్ఞాన శాస్త్రానికి అసాధ్యం లేదుగదా! ★

---

# గుడి - బడి

— శ్రీ అనంతరాములు, వేల్పూరు, నిజామాబాద్ జిల్లా.

గుడిలో దేవుడు మాట్లాడడు
బడిలో దేవుడు మాట్లాడును
మాట్లాడని దేవునికి మంగళహారతి
మాట్లాడిన దేవునకు మట్టిబియ్యం!
మాట్లాడకున్నా దేవుడు
వరాలిస్తాడన్న నమ్మకం!
మాట్లాడిన దేవుడు
ఏమైనా అడుగుతాడన్న భయం!
గుడి బడి ఒక్కటెలా అవుతుంది?
గుడిలో ఉండేది రాయి!
బడిలో ఉండేది మనిషి!




# విద్యారంగంలో విభిన్న ధృవాలు

— శ్రీ వై.వి. సుబ్బారావు

(సోషలిస్టు దేశమైన సోవియట్ విద్యారంగంలో ఎలా పురోగమిస్తున్నదీ, అతి భాగ్యవంతమైనది అన్ని సౌకర్యాలు గలది అని చెప్పబడే పెట్టుబడిదారీ దేశమైన అమెరికాలో విద్యారంగ దుస్థితి ఎలా ఉన్నదీ "మాస్కో న్యూస్"లో 'టట్యానా జార్జియోవా' సమీక్ష ఆధారంగా రచయిత యీ వ్యాసంలో వివరించారు. సం॥)

"అమెరికన్ న్యూస్‌వీక్"లో 'విద్యారంగపరిశోధన' పేరుతో అమెరికన్ విద్యావిధానం సుప్రసిద్ధమైనదని, సోవియట్ విద్యావిధానం తక్కువ స్థాయిగలదని మెరిషన్, కోల్‌మన్ అను వారు వ్యాసాలు వ్రాశారు. తద్వారా ప్రజల్లో భ్రమల్ని రేకెత్తించి తమ గౌరవాన్ని పెంచుకోవాలని ప్రయత్నించారు. అవి ఎంతవరకు నిజమో అమెరికా, సోవియట్ ప్రభుత్వాలు అధికార పూర్వకంగా ప్రకటించిన వివరాలు పరిశీలిస్తే వాటి నిజస్వరూపం తేటతెల్లమవుతుంది.

ఈ మధ్య "అమెరికన్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్" అనే పత్రికవారు "ఫోర్డ్ ఫౌండేషన్"తో కలిసి జరిపిన సర్వేలో యీ క్రింది విషయాలు వెలుగులోకి వచ్చాయి.

"అమెరికన్ యువతీ యువకులలో అత్యధికులు దయాధర్మ భిక్షలతో (ఛారిటీ) అరకొరచదువు (సెమీ లిటరేట్) పొందగల్గుతున్నారు.

1976 విద్యాసంవత్సర అంతానికి అమెరికన్ సెకండరీ పాఠశాలలనుండి వేలాది యువతీయువకులు సాధారణ స్థాయికూడ లేనివారు దొంగ డిప్లమోలతో బయటికి వచ్చారు.

12 సం.ల కాలంలో ఆ పాఠశాలల యువతీయువకులను చదువ, వ్రాయ, మాట్లాడ శక్తికూడా కల్గలేదు".

— ఇదీ సాధారణ పాఠశాలలలోని స్థితి. ఇక అత్యున్నత విద్యాసంస్థల స్థితి ఆ సర్వేలో ఇలా వివరింపబడింది :

అత్యున్నత పాఠశాలల్లోని చదువు సామాన్యులకు అందుబాటులో లేదు.

వాటిల్లోచేరి చదువుటకయ్యే ఖర్చు సం॥నకు 2200 డాలర్ల నుండి 4320 డాలర్లకు పెరిగింది. ఇందువల్ల పెద్దపెద్ద ధనవంతుల బిడ్డలకు తప్ప సామాన్యులకది అందుబాటులో లేకుండా పోయింది.

ఇక అమెరికన్ ప్రభుత్వ లెఖ్ఖల ప్రకారం వివరాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

16 సం॥లకు పైబడిన యువతీ యువకుల్లో నిరక్షరకుక్షులు 2 కోట్ల 30 లక్షలు. చేవ్రాలు సరిగా చేయనివారు కోటి పదిలక్షలు తప్పులతడక వ్రాతగాళ్ళు 6 కోట్ల 30 లక్షలు.

రెండుదేశాలలోనున్న నిజ పరిస్థితులను అవగాహన చేసుకొన్న పాల్‌హలాన్‌డర్ అనే అమెరికా దేశీయుడైన సమాజ శాస్త్రవేత్త తన అభిప్రాయాన్ని క్రింది విధంగా వెల్లడించాడు.

'సోవియట్‌లో విద్యాగంధం పొందటానికి అందరికీ సమాన అవకాశాలున్నాయి. నిరుద్యోగమన్న మాటేలేదు. అక్కడ విద్యారంగంలో సుస్థిరత నెలకొనగా అమెరికాలో స్థిరత కోల్పోయి సంక్షోభం వ్యాపించింది.'

ఇక సోవియట్ ప్రభుత్వ అధికారిక లెఖ్ఖల్నిచూద్దాం.

1975 లో సోవియట్ ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో చేర్చుకోబడినవారి సంఖ్య 4 కోట్ల 80 లక్షలు. అంచేత సెకండరీ ఒకేషనల్ పాఠశాలల్లోను, ప్రత్యేక సెకండరీ పాఠశాలల్లో కూడ సెకండరీ విద్య గరపటంచేత వారినికూడ కలిపిచూస్తే 1975 లో అమెరికన్ సెకండరీ పాఠశాలల విద్యార్థుల సంఖ్యకంటే 4 కోట్ల 90 లక్షలు అధికం.

1970 నుండి 75 వరకు సోవియట్‌లో సంవత్సరమునకు 7.6 శాతం సెకండరీ విద్యపొందే వారైతే అమెరికాలో ఆ సంఖ్య 1.7 శాతం మాత్రమేవుంది.

ఇక ఉన్నత విద్యలు పొందిన వారిసంఖ్య 1975 లో సోవియట్‌లో 94 లక్షలైతే అమెరికాలో 87 లక్షలు మాత్రంగా వుంది.

సోవియట్ నూతన రాజ్యాంగ చట్టం ప్రకారం ఆ దేశంలో యూనివర్సిటీ విద్యవరకు అందరికీ ఉచితంగా లభిస్తుంది. చదువు, ఉద్యోగం ప్రతిపౌరుని హక్కుగా పేర్కొనబడింది. సాంఘికావసరాలకు తగిన విధంగా విద్యనుమార్చి ఆదేశంలో ప్లానుప్రకారం అందరూ విద్యావంతులుగా చేయబడుతున్నారు.

ఇక అమెరికాలో జాతివివక్ష విద్యలోకూడా ప్రవేశించింది. శ్వేతజాతినుండి వేరుపడిన బ్లాక్, రెడ్ఇండియన్స్ పుయర్టోరికన్స్, మెక్సికన్సు మొదలగు వారిలో అత్యధికశాతం నిరక్షరాస్యులే. వారికి ఉన్నతవిద్య ఆకాశకుసుమం.

సోవియట్ రాజ్యాంగం ప్రకారం పూర్తి విద్య అందరికి ఉచితమేగాక, అన్ని గ్రంధాలయాల్లోను, పఠనకేంద్రాల్లోను పుస్తకాలు ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. సెకండరీ, సాంకేతిక విద్యలు అభ్యసించేవారు స్కాలర్‌షిప్‌లు అనేకం పొందుతున్నారు. లేబరేటరీలను, కంప్యూటర్‌లను ఉచితంగా ఉపయోగించుకోవచ్చు.

ఓప్రక్క పనిచేసుకుంటూ ఉన్నతవిద్య, సాంకేతికవిద్యలను జీతబత్తాలుగల శలవులుగా వాడుకొని అభ్యసించవచ్చు. ఇప్పుడు సోవియట్ పాఠశాల్లో 9 కోట్ల 26 లక్షల 5 వేలమంది యువతీ యువకులు వివిధ విద్యల నభ్యసిస్తున్నారు. ఈ సంఖ్య సోవియట్ జనాభాలో 1/3 భాగంగా ఉన్నది.

— పై వివరాల్నిబట్టి విద్యారంగంలో సోషలిస్టు వ్యవస్థలో ఉన్నఅభివృద్ధి, పెట్టుబడిదారీ దేశాల్లోని దిగజారుడు మనకు స్పష్టం కాగలదు.

---

**సంతాపం :** ఆదిలాబాద్ జిల్లా, మంచిర్యాల పట్టణ శాఖ ఉపాధ్యక్షులు శ్రీ బి. వెంకటరామరాజు 11-6-78న గుండెపోటుతో ఆకస్మిక మరణానికి గురయ్యారు. వారి కుటుంబానికి పట్టణశాఖ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది.



# చెన్నుపాటి భవననిధి

| | |
|---|---|
| గత నెలవరకు అందిన మొత్తం | 34 029_60 |
| తూ॥గో॥జిల్లా అమలాపురం పట్టణంనుండి | |
| కుమారి ఎ. లెనోర ద్వారా 300_00 | |
| ,, ఎ. లెనోర | 50_00 |
| శ్రీమతి వై. సరోజినీదేవి | 10_00 |
| ,, టి. భారతి | 10_00 |
| ,, వి. రాధామణి | 10_00 |
| ,, ఎమ్. కె. హేమలత | 5_00 |
| ,, ఐ. ఎస్. హేమలత | 5_00 |
| ,, డి. నాగవేణి | 5_00 |
| ,, పి ఇందిరాదేవి | 5_00 |
| ,, యల్ భువనేశ్వరి | 5_00 |
| ,, యం సిసీలియా | 5_00 |
| ,, యం జ్యోతీహెలెన్ | 5_00 |
| ,, కె శ్యామల | 5_00 |
| ,, బి సింహాచలం | 5_00 |
| ,, యం వి రవణమ్మ | 5_00 |
| ,, సరోజిని | 5_00 |
| ,, డి రామతులశమ్మ | 25_00 |
| శ్రీ ఎ. ఉమామహేశ్వరరావు | 5_00 |
| ,, రమణమూర్తి | 5_00 |
| ,, పి. వీరభద్రరావు | 5_00 |
| ,, కె. రామచంద్రరావు | 5_00 |
| ,, ఎమ్. జి. భానుమూర్తి | 5_00 |
| ,, ఎమ్. చిట్టిబాబు | 5_00 |
| ,, బి. సత్యనారాయణ | 5_00 |
| ,, పి. లక్ష్మణరావు | 5_00 |
| ,, డి. సూర్యనారాయణ | 5_00 |
| ,, ఆర్. రామారావు | 5_00 |
| ,, ఇ. భాస్కరరావు | 5_00 |
| ,, ఎన్. ఆంజూస్ | 5_00 |
| ,, పి. వి. ఎస్. ఆర్. సుబ్బారావు | 5_00 |
| ,, కె. వి. శ్రీనివాసమూర్తి | 5_00 |
| ,, టి. శామ్యూలు | 10_00 |
| ,, కొప్పర్తి రాజగోపాలం | 5_00 |
| ,, యం. సూర్యనారాయణమూర్తి | 5_00 |
| ,, యం. రామారావు | 5_00 |
| ,, జి. సోమేశ్వరరావు | 5_00 |
| ,, సి. హెచ్. విశ్వేశ్వరరావు | 5_00 |
| ,, ఎస్. వెంకటేశ్వర్లు | 5_00 |
| ,, టి. జయరాంమోహన్‌సూరి | 5_00 |
| ,, ఎస్. సూర్యనారాయణ | 5_00 |
| ,, కె. గణపతిరావు | 10_00 |
| ,, వి. సత్యనారాయణ | 5_00 |
| ,, సిహెచ్. సత్యనారాయణ | 5_00 |
| శ్రీ జి. చిట్టియ్యగారిద్వారా | |
| కాకినాడ పట్టణం నుండి 44_00 | |
| ,, సిహెచ్. సూర్యారావు | 5_00 |
| ,, సిహెచ్.వి. సూర్యప్రకాశరావు | 5_00 |
| ,, కె. సూర్యనారాయణ | 5_00 |
| శ్రీమతి పి. పాపయ్యమ్మ | 5_00 |
| శ్రీ సి.వి.ఆర్. రామమోహనరావు | 5_00 |
| ,, వై. ధనరాజు | 5_00 |
| ,, కె.వి. సుబ్బారావు | 5_00 |
| శ్రీమతి యస్. సుబ్బరాజమ్మ | 5_00 |
| ,, సి.బి.యం. స్కూలు స్టాఫ్ | 4_00 |
| శ్రీ కె. వి. సత్యనారాయణమూర్తి ద్వారా | |
| పి. గన్నవరం సమితినుండి 75_00 | |
| శ్రీ ఎం.వి.ఆర్. సుబ్బారావు, యుపి.స్కూలు ఊదరాద | 5_00 |
| ,, పి. వి. నారాయణాచార్యులు ,, ,, | 5_00 |
| ,, వై. యన్. ఆర్. చంద్రారావు ,, ,, | 5_00 |
| ,, యాళ్ళ సత్యనారాయణమూర్తి ,, ,, | 5_00 |
| ,, కె.యస్. యస్. సింగరాచార్యులు ,, ,, (తెలుగుపండిట్) | 5_00 |
| ,, ఎ. రంగనాధరాజు (హిందీపండిట్) ,, ,, | 5_00 |
| ,, కె. నరసింహమూర్తి ,, ,, | 5_00 |
| ,, వై. స్వామినాయుడు ,, ,, | 5_00 |
| ,, కె. వెంకటశెట్టి (గాంధి) ,, ,, | 5_00 |
| ,, యం. సత్యనారాయణ ,, ,, | 5_00 |
| ,, మీర్జా అబ్బాస్ హైదర్ ,, ,, | 5_00 |
| ,, గోకవరపు పెరుమాళ్ళస్వామి లూటుకుర్రు | 5_00 |
| ,, యం. సత్యనారాయణ అప్పనపల్లి | 5_00 |
| ,, కైకాలపేట విద్యార్థులు | 10_00 |
| శ్రీ కె. వి. వి. యస్. వి. ప్రసాద్‌చౌదరి | |
| అమలాపురం సమితినుండి రు. 24_00 | |
| మాగాం యు. పి. స్కూలు స్టాఫ్ | 16_00 |
| యం. శ్రీరామచంద్రమూర్తి | 4_00 |
| పి. వీరమహేశ్వరరావు | 4_00 |
| ప్రకాశంజిల్లా | |
| ద్రోణాదుల రామయ్య - మల్లమూరివారి పాలెం | 20_00 |
| మహబూబ్ నగర్ జిల్లా | |
| యస్. వీరన్న, నాగర్ కర్నూల్ | 5_00 |
| విద్యార్థిసంఘ కార్యదర్శి కుమారి టి. జ్యోతి ద్వారా | |
| ఎల్. వీరాస్వామి మార్చాల | 1_00 |
| టి. జ్యోతి ,, | 2_00 |
| డి. సుధ ,, | 2_00 |
| కె. విజయ శ్రీ ,, | 2_00 |
| మొత్తం | 34,592_60 |

## బదిలీలు కావాలా?



కడప జిల్లాకు : వి.యస్. రెడ్డి, గ్రేడ్ II తెలుగు పండిట్, చీపురుపల్లి సమితి, సాతంవలస, వయా, రాజాం, శ్రీకాకుళం జిల్లా. 532127.

నెల్లూరు జిల్లాకు : (బుచ్చిరెడ్డిపాలెం, పంటల అల్లూరు సమితులకు) ఓ. సుబ్రహ్మణ్యం పి.యస్.యి. స్కూలు, భోగనం పాడు, కోటపాడు అగ్రహారంపోస్ట్, వయా, పెద అలవలపాడు, కందుకూరు తాలూకా, ప్రకాశంజిల్లా.

(జడ్.పి.కి) జె. కృష్ణుడు, తెల్కు_లు, బి.ఏ.బి.యిడి.పి.యస్. యు.పి స్కూలు, ఐతగుళ్ళపాడు, వీరుమామిళ్ళ సమితి, కడపజిల్లా

కృష్ణాజిల్లాకు : యస్. అనసూయ, పి. యస్. యి. స్కూలు, గవరపేటపోస్ట్, వయా, దగ్గులూరు, నర్సాపూర్ తాలూకా ప.గో. జిల్లా.

ప్రకాశం జిల్లాకు : బి. శాంసన్, పి యస్. ప్రాథమిక పాఠశాల, శంకరాపురం, దోన్ తాలూకా, కర్నూలుజిల్లా

వరంగల్ జిల్లాకు : జిల్లా పరిషత్ కుగాని, మరిపెడ సమితిగాని, టి. కృష్ణమూర్తి బి. ఎ. సెకండరీగ్రేడ్ టీచర్, జిల్లా పరిషత్ సెకండరీ స్కూలు, యం, వెంకటాయపాలెం, ఖమ్మం, 507003.

ఖమ్మం జిల్లాకు : యస్. సి. హెచ్. సీత గ్రేడు II తెలుగుపండిట్ జిల్లా పరిషత్ హైస్కూలు కైకరం, ప.గో. 534416.

---

శ్రద్ధాంజలి : అనంతపురం జిల్లా కుంటిమద్ది వాస్తవ్యులు ప్రముఖ స్వాతంత్ర్యయోధులు శ్రీ బెల్లంకొండ నారాయణశెట్టి 29-7-77 వ అనంతపురం హాస్పటల్‌లో కన్నుమూశారు. వారు జిల్లా యు.టి.యఫ్. ప్రధాన కార్యదర్శి శ్రీ బి. వెంకట సుబ్బయ్య గారి అన్నగారు. వారి కుటుంబానికి శ్రీ మేడా వెంకటాచలం స్వాతంత్ర్య సమరయోధుల తరపున తమ గాఢసంతాపాన్ని తెల్పుతున్నారు.

### భవన ధినికి _ ఆదర్శ కృషి

యం. నగర్ మార్చాల యు.పి. పాఠశాల విద్యార్థి సంఘం కుమారి టి. జ్యోతిద్వారా రూ. 7 లు అందజేసిరి. అలాగే తూ.గో. జిల్లా పి. గన్నవరం సమితి కైకాలపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రూ. 10 లు అందజేసిరి. ఇది ఆదర్శంగా స్వీకరిద్దాం. చిన్నారులకు ధన్యవాదాలు తెల్పుదాం.

## "ఏ కులం"

—రామచంద్ర

పెళ్ళయింది మొన్ననే ఓ పిల్ల రచయితకి,
పెళ్ళాడింది మరో కులం పిల్లని
ఆదర్శాలు రచనల్లోనే కాదని నిరూపించేడన్నారు
ప్రశంసల వర్షం కురిపించేరు
ఆదర్శ రచయిత ఆదర్శ కాపురంలో
ఆరుసంవత్సరాలు దొర్లాయి ముచ్చటగా ముగ్గురు పిల్లలతో
పెద్దాడ్ని బళ్ళో చేర్పించాలనుకున్నాడు పాపం,
కానీ
మూర్ఛపోయాడా రచయిత అప్లికేషన్ ఫారంచూసి
పిల్లాడిది "ఏ" కులమని వ్రాయాలో తెలీక.

---

### చందా దారులకు – కార్య కర్తలకు

1. పత్రిక మీకు చేరిన వెంటనే మీ అడ్రసు ప్రక్కగల చందా నెంబరు డైరీలో నోట్ చేసుకోండి.

2. అడ్రసు మార్పులుగాని, పత్రిక అందకపోవడం గురించిగాని వ్రాసేటప్పుడు విధిగా చందా నెంబరు తెలుపండి_ లేనిచో పరిశీలింపబడవు.

3. చందాదారులు అడ్రసు విడి అక్షరాలతో, పిన్ కోడ్‌తో వ్రాయండి.

4. కార్యకర్తలు డూప్లికేటులో అడ్రసుల లిస్టులు పంపిన, నంబర్లు యిచ్చి ఒకటి పంపగలం.

5. పత్రిక సొమ్ము యం. ఓ. చేయువారు ఎడిటర్ ఐక్యఉపాధ్యాయ, అకులవారివీధి విజయవాడ_2 అడ్రసుకు పంపండి. యం. ఓ. కూపను క్రింద మీ పూర్తి అడ్రసు వ్రాయడం మరచిపోకండి.

6. సంఘం సొమ్ము యం. ఓ. చేయువారు ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అకులవారివీధి, విజయవాడ_2 అడ్రసుకు పంపండి.

7. పత్రిక సొమ్ము బ్యాంకు డ్రాఫ్టు ద్వారా పంపువారు "IKYAUPADHYAYA" పేర ఏ బ్యాంకు నుండి అయినా క్రాసుచేసి పంపవచ్చు.

8. సంఘము సొమ్ము బ్యాంకు డ్రాఫ్టు ద్వారా పంపువారు "A. P, United teacher's federation" పేరిట ఏ బ్యాంకు నుండి అయినా క్రాసుచేసి పంపండి.

9. చెన్నుపాటి భవన నిధికి యం. ఓ. చేయువారు ప్రధాన కార్యదర్శి పేరను, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా అయిన "A. P. U. T. F. CHENNUPATI BULIDING FUND" అనుపేర ఏ బ్యాంకు నుండి అయినా క్రాసు చేసి పంపించండి.

10. పత్రికకుగాని, సంఘమునకుగాని, భవన నిధికి గాని సొమ్ము పంపువారు ఎట్టి పరిస్థితులలోను వ్యక్తుల పేర పంపరాదు.

11. జీవిత చందాదారులు ఫోటోలు పంపించిన చాలు నెగెటివ్‌లు అక్కరలేదు.




# చలో హైదరాబాద్!

## అపరిష్కృత సమస్యలపై అసెంబ్లీముందు ప్రదర్శన

ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల్ని ప్రభుత్వ దృష్టికి తెచ్చి వాటిని సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేసేందుకు వేలాదిమంది ఉపాధ్యాయులతో రెండవదశ ఆందోళనాకార్యక్రమంలో భాగంగా 78 సెప్టెంబరు 8 వ అసెంబ్లీ ఎదుట ప్రదర్శన జరపాలని యు, టి. యఫ్. కార్యవర్గం 23-7-78 న విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో శ్రీ కె. నారాయణరావు అధ్యక్షతన సమావేశమై నిర్ణయించింది. అందుకు కలిసి రావలసిందిగా అన్ని ఉపాధ్యాయ సంఘాలకు విజ్ఞప్తి చేసింది.

మొదట యు.టి.యఫ్. కార్యక్రమాలను, తెలంగాణా యం. యల్.సి. ఎన్నికల గురించి అధ్యక్షులు సమీక్షించారు. పిదప ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ.వెంకటస్వామి ఫిబ్రవరిలో కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగిన రాష్ట్రవ్యాప్త ధర్నా కార్యక్రమాన్ని దానిఫలితాల్ని జూన్‌లో విద్యామంత్రితో జరిగిన కోఆర్డినేషన్ సమావేశ వివరాల్ని సభ్యులముందుంచారు. ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల, సాచివేత విధానం వల్ల అనేక సమస్యలు పరిష్కరింపబడక హామీలు అమలు జరగక, ఉద్యోగులమధ్య వివక్ష చూపబడుతూ విద్యాబిల్లు వెలుగు చూడని పరిస్థితినీ, రిటైర్‌మెంట్ వయస్సు వెనక్కు నెట్టిన దుస్థితినీ వివిధ ఉదాహరణలతో వివరించారు. రెండవదశ పోరాట కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీముందు ప్రదర్శన చేయాల్సిన అవసరాన్ని తేటపరిచారు.

తర్వాత శ్రీ మైనేని వెంకటరత్నం (ఎడిటర్, ఐక్య ఉపాధ్యాయ) పత్రిక సాధించిన ప్రగతినీ, ఉద్యమ వాణిగా నిర్వర్తించిన కర్తవ్యాల్ని సర్క్యులేషన్ వివరాన్ని తెలియజేశారు.

శ్రీ యం. నరహరి హైదరాబాద్ బ్రాంచి ఆఫీసు రిపోర్టు ఇచ్చిన పిదప వివిధ జిల్లాల నివేదికలు సమర్పిస్తూ శ్రీయుతులు యం. ఏసురత్నం, యన్. రామకోటేశ్వరరావు, వి. సూర్యనారాయణరాజు, యస్. ఆర్. పోలిశెట్టి, టి. అంజిరెడ్డి వై. యల్. నారాయణ, పి. కృష్ణమూర్తి, కె. తిరిపాలు, ఆర్. రాఘవయ్య, పి. సత్యనారాయణ, జి. మల్లయ్య, పి. వి. సుబ్బరాజుగార్లు చర్చల్లో పాల్గొని వివిధ సూచనలు చేశారు.

పిదప జిల్లాశాఖల మహాసభలు, నూతన కౌన్సిళ్ళు ఆగష్టు లోపల పూర్తిగావాలని, యం.యల్ సి. ఎన్నికల జమా-ఖర్చులు కౌంటర్‌ఫైల్స్ ఆగష్టు 10 లోగా రాష్ట్రఆఫీసుకు అందించాలని, చెన్నుపాటి భవనం ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, కొత్తగా సంబంధాలు ఏర్పడిన జిల్లాల్లో ఉద్యమవ్యాప్తికీ, నిర్మాణానికి, పూనుకోవాలని కార్యవర్గం నిర్ణయించింది.

ప్రభుత్వం ఉపాధ్యాయులకిచ్చిన అనేక హామీలు అమలు జరుపబడలేదు. ఉద్యోగులమధ్య వివక్ష చూపబడుతున్నది. నిబంధనలకు వ్యతిరేకంగా విచ్చలవిడి బదిలీలు జరుగుతున్నాయి. విద్యాబిల్లు చట్టంగానేలేదు. రిటైర్‌మెంట్ వయసు పెంపుదలగాలేదు. ఇంకా దీర్ఘకాలంగా అనేకసమస్యలు అపరిష్కృతంగాఉన్నవి. వీటన్నిటిని ప్రభుత్వ దృష్టికి తేవటానికి వేలాదిమంది ఉపాధ్యాయులతో సెప్టెంబరు 8న అసెంబ్లీముందు ప్రదర్శన జరపాలని కార్యవర్గం తీర్మానించింది. అందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలసిరావలసిందిగా కోరటానికి లెటర్లు పెట్టాలని నిర్ణయించింది

ప్రభుత్వం అక్రమంగా తగ్గించిన ఏజన్సీ అలవెన్స్ పునరుద్ధరించాలని, విచ్చలవిడిగా జరిగే బదిలీలను అరికట్టటానికి చట్టబద్ధమైన బదిలీకోడ్ రూపొందించాలని, విద్యాబిల్లు వెంటనే చట్టం చేయాలని, రిటైర్‌మెంట్ వయసు 60 సం॥కు పెంచాలని, ఖమ్మం జిల్లా జూనియర్ కాలేజీలలో 1958కి పూర్వమే కేడర్ స్ట్రెంక్త్ నిర్ణయింపబడినా తిరిగి నిర్ణయించాలనటం అనుచితమనీ ఒకవేళ నిర్ణయించినా జూన్ నెల ఆఖరులోగాక నెల మొదట నిర్ణయించటం అక్రమమనీ, అట్లు నిర్ణయించినా అదనపు స్టాఫ్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయక జిల్లాపరిషత్‌లకు సరెండర్ చేయాలనటం లోగడ ప్రభుత్వం యిచ్చిన ఉత్తర్వులకే విరుద్ధమనీ, కాబట్టి ప్రస్తుతం జారీచేసిన ఉత్తర్వుల్ని ఉపసంహరించి సదరు పోష్టులు ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగనివ్వాలని కావలి రామకృష్ణయ్య అప్పర్‌ప్రైమరీ టీచర్ల ఆందోళనను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, రాష్ట్రంలో పలుచోట్ల ఉపాధ్యాయులపై జరుగుతున్న దౌర్జన్యాల్ని ఖండిస్తూ దోషుల్ని శిక్షించి టీచర్లకు రక్షణ కల్పించాలని, చిత్తూరు సమితిలో రాష్ట్ర వ్యాప్త ధర్నాలో పాల్గొనినందుకుగాను కక్ష చర్యగా ఒకరోజు జీతాన్ని నిలిపివేసి క్లారిఫికేషన్ పేరుతో చేస్తున్న అనవసర జాప్యాన్ని ఖండిస్తూ సమితి అధికారులు బ్యురాక్రసీ ధోరణులు మానాలని ప్రభుత్వం వెంటనే జోక్యం కలుగజేసుకొని ఆపివేసిన ఒకరోజు జీతం వెంటనే ఇప్పించాలని సమావేశం డిమాండుచేస్తూ వివిధ తీర్మానాలు ఆమోదించింది.

### రాజధానిలో రాయబారాలు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పక్షాన విద్యాశాఖ మంత్రి, డైరెక్టరు తదితర అధికారులను జులై 31, ఆగస్టు 1వ తేదీలలో కలసి అనేకసమస్యలపై మెమొరాండములు యిచ్చుట జరిగినది.

అందు ప్రభుత్వ జూనియర్ కాలేజి సిబ్బందిని, జిల్లా పరిషత్‌కు సరెండర్ చేయుట విలుపుదల గురించి, ఎయిడెడ్ ఉపాధ్యాయుల గ్రాంటురిలీజు గురించి, ఏజన్సీ అలవెన్సుగురించి, ట్రయిబలు వెల్‌ఫేర్ ఉపాధ్యాయుల గ్రాంటుగురించి, అనేక జనరల్ వ్యక్తిగత సమస్యల గురించి మెమొరాండములు యిచ్చి చర్చించుట జరిగింది: సమస్యలు పరిశీలించి తగురీతి పరిష్కరించెదమని హామీ యిచ్చారు.

రాయబార వర్గములో శ్రీ జి. లక్ష్మయ్య, శ్రీ యం. నరహరి గారలు, శాసనమండలి సభ్యులు శ్రీ యం. మాధవరావు, శ్రీ యం. జె. మాణిక్యారావుగారలు గలరు.

## రాజమండ్రి లెక్చరర్ల ఆందోళనకు యు. టి. యఫ్. మద్దతు

రాజమండ్రి శ్రీ వీరేశలింగం డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్న 22 మంది లెక్చెరర్లకు గత 7 మాసాలనుండి జీతాలులేక పలుబాధలకు గురయ్యారు. అనేకసార్లు మేనేజిమెంటుకు చెప్పుకొన్నా, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోగా చివరికి శ్రీ జి. రామమోహనరావు 7-7-78 నుండి ఆమరణ నిరాహారదీక్ష పూనటం జరిగింది. వారికి మద్దతుగా పట్టణంలోని కళాశాలలు, హైస్కూళ్ళు నిరసన తెల్పుతూ ఒకరోజు మూసివేశారు. నిరాహారదీక్ష 7 వ రోజుకు చేరుకోగా పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అపుడు శ్రీ డి. శివరామరాజు (యం.యల్.సి.) శ్రీమతి టి. సత్యవతి (యం.యల్.ఎ.) శ్రీ పి. బి. ముత్తారావు (ప్రసిడెంట్, జిల్లా యు.టి.యఫ్.)గార్లు మేనేజిమెంటును కలుసుకొని సంప్రదింపులు జరిపారు. ఫలితంగా మూడుమాసాల జీతాలు జూలై లోగా చెల్లించటానికి, మిగతాది ఈ సంవత్సరంలోగా ఇవ్వటానికి, ఇక నుండి నెల నెలా జీతాలు ఇవ్వటానికి మేనేజిమెంటు అంగీకరించింది. దానిపై అమరణ నిరాహారదీక్ష విరమింపబడింది. ఈ సమస్యపై జిల్లా, పట్టణ యు. టి. యఫ్. శాఖలు పూర్తి మద్దతు ఇచ్చాయి. శ్రీ పి. బి. ముత్తారావు, శ్రీ కె. యఫ్. సాల్మన్‌రాజు (పట్టణశాఖ ప్రధానకార్యదర్శి) మొత్తం ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. యు.టి.యఫ్. ఇచ్చిన సహకారానికి ఆ సందర్భంలో జరిగిన సభలో కాలేజీ స్టేఫ్ సెక్రటరీ ధన్యవాదాలు తెల్పారు.

## రావణాసురుడి కాష్ఠంలా మండుతున్న రాజమండ్రి నేషనల్ సీనియర్ బేసిక్ స్కూలు

రాజమండ్రిలో చరిత్ర ప్రసిద్ధిగల పాఠశాలల్లో నేషనల్ సీనియర్ బేసిక్ స్కూలు ఒకటి. అది ప్రైవేటు మేనేజిమెంటుకు చెందింది. దానిలో 22 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 1967 నుండి ఉపాధ్యాయులకు, మేనేజిమెంటుకుమధ్య ఘర్షణల కారణంగా చివరికి టీచర్లకు డైరెక్ట్ పేమెంట్ ఇస్తున్నారు.

ఆ పాఠశాలలో సెకండరీగ్రేడ్‌గా పనిచేస్తున్న శ్రీ పి. పైడి రాజును మేనేజిమెంట్ సస్పెండ్ చేసి, తర్వాత టెర్మినేట్ చేసింది. ఆయన సభ్యుడుగావున్న టీచర్స్ ఫెడరేషన్ రంగంలో ప్రవేశించి, "స్కూలును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ, ఆయన్ని ఉద్యోగంలోకి తీసుకోవాలని", ఆందోళన చేసింది. దానికి పాఠశాల ఉపాధ్యాయులంతా సహకరించారు. కాని చివరికి శ్రీ పైడిరాజు మేనేజరుతో లాలూచీపడి తిరిగి హెడ్మాష్టరు గిరి పొందేరు. అంతవరకు ఆయన్ని సపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయులు దానితో నిర్విణ్ణులయ్యారు. కొందరు టీచర్లుకూడా మేనేజిమెంటుకు సరెండర్ అయి పైడిరాజుగార్ని అనుసరించారు. ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రం సరెండర్ గాక వ్యక్తిత్వం చూపటంతో వారిని మళ్ళీ మేనేజరు ఉద్యోగాల నుండి తొలగించారు. వారి స్థానాల్లో ముగ్గుర్ని కొత్తవార్ని చేర్చుకున్నారు. దానితో జిల్లా యు.టి.యఫ్. అధ్యక్షుడు జోక్యం కలుగజేసుకొని డి.యస్.ఓ.ను, నగర పెద్దల్ని కలిసి తిరిగి పోస్టింగులు వేయించారు. దానితో మండిపడిన మేనేజిమెంటు డి. ఐ. ఆఫీసులో తిష్ఠవేసి అందరు ఉపాధ్యాయులకు జీతాలురాకుండా అవుచేయించారు. రావణాసురుడి కాష్ఠంలా మండుతున్న ఆ పాఠశాలని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఉపాధ్యాయుల వృత్తి భద్రతకు, సంక్షేమానికి తోడ్పడాలని శ్రీ పి.బి. ముత్తారావు కోరుతున్నారు.

## ఉపాధ్యాయులకొరకు జి. ఓ. లా ? జి. ఓ.ల కొరకు ఉపాధ్యాయులా ?

### శాసనసభ్యుల సన్మానసభలో యు.టి.యఫ్. నాయకుని సూటిప్రశ్న

25-7-78 న కడియం, బూరుగుపూడి నియోజకవర్గ శాసన సభ్యులను, కొత్తగా బదిలీయైవచ్చిన బి.డి.ఓ. గారికి గాంధిపురం సెంటర్ టీచర్లు జరిపిన సన్మాన సందర్భంలో యు. టి. యఫ్. నాయకులు శ్రీ పి. బి. ముత్తారావు ఉపాధ్యాయ సమస్యల్ని, జి.ఓ.ల్ని నిష్ప్రయోజనంచేస్తున్న తీరును ప్రజాప్రతినిధుల దృష్టికి తెస్తూ వివిధ ఉదాహరణల్తో స్పష్టపరిచారు. శాసనసభ్యులు సమాధానంచెప్తూ సమస్యా పరిష్కారానికి తమ తోడ్పాటు వెల్లడించారు.

ఆ సన్మానసభకు శ్రీ ఒ. ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. సెంటర్ కార్యదర్శి శ్రీ వి. వెంకటరెడ్డి వక్తల్ని పరిచయం చేసి వేదికపైకి ఆహ్వానించారు. శ్రీ కె. వి. రాజు ఉపాధ్యాయుల పక్షాన మెమోరాండం ఇచ్చారు. శ్రీ డి. సంజీవరావు, శ్రీ కె. గురుమూర్తిగార్లు స్వాగతపద్యాలు చదివారు. శ్రీ బి.డి.ఓ. త్వరలో కో-ఆర్డినేషన్ మీటింగువేసి సమస్యాపరిష్కారానికి పూనుకొంటానని హామి యిచ్చారు.

**వరంగల్ జిల్లా :** 16.7.78 న జిల్లాఎన్నికల కమిటీ సమావేశం శ్రీ యం. లక్ష్మీనారాయణ అధ్యక్షతనజరిగింది. శ్రీ ఎ. వెంకటస్వామి ప్రత్యేకాహ్వానితులుగా రాష్ట్ర సంఘంనుండి హాజరయ్యారు. జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీ డి. మల్లయ్య ఎన్నికల సమీక్ష చదివి జిల్లాలో ఉద్యమం విస్తరించాల్సిన అవసరాన్ని, అనుకూల పరిస్థితుల్ని కార్యకర్తలు వివరించారు. ఉద్యమాభివృద్ధికి, సంఘ కార్యక్రమాలు సక్రమంగా సాగటానికి పటిష్ఠసంఘ నిర్మాణావసరాన్ని శ్రీ వెంకటస్వామి నొక్కిచెప్పి వివిధ సూచనల్నిచేశారు. ఆమేరకు ఆగస్టులోగా సమితి, పట్టణ, జిల్లాశాఖల నిర్మాణంపూర్తి చేయటానికి నిర్ణయాలు తీసుకొన్నారు.

వాటిని అమలులో పెట్టటానికి 21.7.78 న శ్రీ జె.కనకయ్య అధ్యక్షతన జిల్లాసబ్‌కమిటీ సమావేశమయింది. రాష్ట్రశాఖ ఆదేశానుసారం జిల్లాలో నిర్మాణంపై శ్రీ జి. మల్లయ్య రిపోర్టుఇచ్చారు. 6.8.78 లోగా అన్నిపట్టణ, సమితిశాఖలు సభ్యత్వ కౌంటర్ ఫైల్స్ కౌన్సిలర్ల లిస్టులు అందించాలని, ఎన్నికల జమాఖర్చు లన్నింటిని జిల్లాశాఖకు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. తిరిగి 6.8.78 న సమావేశమై ఎన్నికల తేదీలను నిర్ణయించాలని తీర్మానించారు.

**వర్ధన్నపేట సమితిశాఖ :** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట సమితిశాఖ విస్తృత కార్యవర్గ సమావేశం 23-7-78న శ్రీ జి. భద్రయ్య అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. సోమయ్య సమర్పించిన నివేదిక ఆమోదించిన అనంతరం యు.పి. స్కూళ్ళలో ఖాళీలు వెంటనే భర్తీచేయాలని, టీచర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ పూర్తిచేయాలని, కోఆర్డినేషన్ మీటింగు వెంటనే ఏర్పాటు

చేయాలని, ఇంక్రిమెంట్లు ఎరియర్ బిల్లులు శాంక్షన్ చేయాలని, ఇన్‌సర్వీసు వారికి శలవుతో శిక్షణా సౌకర్యం కల్పించాలని వివిధ తీర్మానాలు ఆమోదించటం జరిగింది.

**తెనాలి పట్టణశాఖ :** 30-7-78న శ్రీ జి.వి. అప్పారావు అధ్యక్షతన పట్టణ జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ వి.వి.యల్. నారాయణ కార్యదర్శి నివేదిక సమర్పించారు. కమీషనర్, డి ఇ.ఓ. ఆఫీసుల్లో పెండింగ్‌లోగల వివిధ తీర్మానాలు ఆమోదించిన పిదప శ్రీ వై. యల్. నారాయణ పర్యవేక్షణలో అధ్యక్షులుగా శ్రీ జి.వి. అప్పారావు, ఉపాధ్యక్షులుగా శ్రీ జి.యస్. ప్రసాద్, శ్రీమతి ఆర్. సుశీల, ప్రధాన కార్యదర్శిగా శ్రీ వి.వి.యల్. నారాయణ కార్యదర్శులుగా శ్రీ వి. వెంకటేశ్వరరావు, శ్రీ కె రాజారావు కార్యవర్గ సభ్యులుగా సర్వశ్రీ వి పిచ్చయ్య, యం. హనుమంతరావు, యం. శేషగిరిరావు, శ్రీమతి యన్. వెంకటరత్నంగార్లు ఎన్నికయ్యారు.

**పిఠాపురం పట్టణశాఖ :** 30-7-78 న శ్రీ పి. బి. ముత్తారావు పర్యవేక్షణలో పట్టణశాఖ ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శి శ్రీ యల్. సోమరాజు సమర్పించిన నివేదికపై పలువురు చర్చల్లో పాల్గొన్నారు. పిదప నూతన సంవత్సరానికి అధ్యక్షులుగా శ్రీ యస్. వెంకటరత్నం, ఉపాధ్యక్షులుగా శ్రీ యన్. బుల్లిరాజు, శ్రీమతి కె. గ్రేస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీ యల్. సోమరాజు, కార్యదర్శులుగా శ్రీ గౌస్ మొహిద్దీన్, శ్రీ బి సత్యానందంగార్లు మరి ఎనిమిదిమంది కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కూడా ఫేమిలీ బెనిఫిట్ స్కీము అమలు పరచాలని, ఉద్యోగ విరమణ వయస్సు 60 కి పెంచాలని, ఉపాధ్యాయుల గృహ నిర్మాణానికి ఋణసౌకర్యం కల్పించాలని, 429 జి.ఓ. రద్దుచేయాలని వివిధ తీర్మానాలు ఆమోదించారు.

**సూర్యాపేట సమితిశాఖ :** సమితి ఉపాధ్యాయులు 30-7-78 న సమావేశమై శ్రీ ఎ. వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా, శ్రీ జి. జయప్రతాపరెడ్డి, శ్రీ డి. అరుణకుమార్‌గార్లు ఉపాధ్యక్షులుగా, శ్రీ యస్. భాస్కరరాజు ప్రధాన కార్యదర్శిగా, శ్రీ డి. రవిశంకరవర్మ, శ్రీ నర్సింహాచార్యులు కార్యదర్శులుగా అడ్‌హక్ బాడీని ఎన్నుకొన్నారు. ఈ సమావేశానికి జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ పి. కృష్ణమూర్తి, శ్రీ పి. సత్యనారాయణగార్లు హాజరై సందేశాలిచ్చారు.

**పత్తికొండ సమితి :** 20-6-78 న కర్నూలు జిల్లా పత్తికొండ సమితి కోఆర్డినేషన్ మీటింగు జరిగింది. యు.టి.యఫ్. పక్షాన అధ్యక్షుడు శ్రీ జి. రాజశేఖామణి, ప్రధాన కార్యదర్శి శ్రీ యం. నర్సప్ప హాజరై 14 సమస్యలు ఎజెండాకు సమర్పించారు. 1973 నం. సమ్మెకాలం గూర్చి, 1-4-68 కి పూర్వం ఎరియర్స్ గూర్చి తాము తీసుకొన్న చర్యల్ని అధికారులు వివరించారు. అన్ని సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామని శ్రీ బి డి.ఓ. హామీ యిచ్చారు,

### భీమవరం పట్టణశాఖ

భీమవరం పట్టణశాఖ సమావేశాలు శ్రీ పి. యస్. సూర్యనారాయణగారి అధ్యక్షతన ఆగస్టు 6 న జరిగింది. శ్రీ గ్రంధి వెంకటరావు కార్యదర్శి రిపోర్టు యిచ్చిరి. చర్చలో శ్రీయుతులు పి. యన్. మూర్తి, కె. గౌరీపతి, యన్. యస్. యస్. శర్మ, శ్రీమతి ఎ. అనసూయ, తదితరులు పాల్గొనిరి.

## తూ. గో. జిల్లా మహాసభల దిగ్విజయానికి రాజోలుసమితియు.టి.యఫ్ శాఖ విస్తృతప్రచారం

పెద్దాపురంలో ఆగస్టు చివరివారంలో జరుగనున్న తూ.గో. జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభల దిగ్విజయానికి యీనెల 3, 4, 5 తేదీల్లో శ్రీ మైనేని వెంకటరత్నం ఆధ్వర్యాన సమితిశాఖ ఉపాధ్యక్ష, కార్యదర్శులు శ్రీ యన్. రామకృష్ణంరాజు, శ్రీ కె. సింహాచలం, కార్యదర్శి శ్రీ డి. జనార్ధనరావు, సర్వశ్రీ ఐ. సూర్యనారాయణమూర్తి, వై. సూరపరాజు, కె గోవయ్య, పి.హెచ్.కామరాజు, పి. మాధవమీనన్ దళంగా బయల్దేరి సమితిలోగల వివిధ విద్యాలయాల్ని సందర్శించి మహాసభల ప్రాముఖ్యాన్ని వివరించి, విరాళాలు అభ్యర్థించారు. ప్రతిచోట ఉపాధ్యాయులు ఎంతో ఆప్యాయత చూపి తమ సహకారాన్ని తెలియజేశారు. ఆ పర్యటనలో వివిధ యు పి. పాఠశాలలు, రామేశ్వరం, మోరి, శివకోడు, రాజోలు (బోయ్స్ అండ్ గరల్స్) జడ్.పి. హైస్కూళ్ళు, సఖినేటిపల్లిలో లూథరన్ హైస్కూలు, మల్కిపురం ఎ.యఫ్.డి.టి విద్యాలయాలు లక్కవరం సెంటర్లలో సమావేశాలలో పాల్గొని శ్రీ మైనేని యు.టి.యఫ్ ఆశయాల్ని, పోరాట కార్యక్రమాల్ని వివరించటంతో పాటు మహాసభలకు, భవననిధికి తోడ్పాటు కోరటం జరిగింది. కలుసుకొన్న ఉపాధ్యాయులు ఇతరులు ఎంతో ఆదరాభిమానాలు చూపి దాదాపు రు. 700 లు విరాళాలు ప్రకటించటం జరిగింది. ఈవిధంగా సహకరించినందుకు సమితి యు.టి.యఫ్. శాఖ ఉపాధ్యాయ వర్గానికి, ఇతర దాతలకు అభివందనాలు తెలియజేస్తున్నది.

## అమలాపురం సమితిలో
## వెయ్యిన్నూట పదార్లు విరాళం

జిల్లా మహాసభల జయప్రదానికి అమలాపురం సమితిలో యీనెల 3, 4, 5 6, 7, 8 తేదీలు రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీ ఎ. వెంకటస్వామి ఆధ్వర్యాన శ్రీయుతులు వి. మాధవరావు, యం. నాగభూషణం, బి. రంగనాయకులు, డి. సుబ్బారావు, ప్రసాద్‌చౌదరి, జి. సత్యనారాయణ, కె. అప్పలస్వామి, జి. రామ్మూర్తి తదితరులు పాల్గొనిరి. సమితి అన్ని సెంటర్లలో ఉపాధ్యాయులు యు.టి.యఫ్.ను ఆదరించి, ఉదారంగా విరాళాలు యిచ్చిరి.

## జిల్లాలో అపూర్వ సంచలనం

తూ. గో. జిల్లా విద్యామహాసభలు పెద్దాపురంలోజరుగనున్న సందర్భంలో పి. బి. ముత్తారావుగారు, కోరుకొండ, పిఠాపురం మొదలగు సమితులు పర్యటించి విరాళములు సేకరించిరి శ్రీ వి. సూర్యనారాయణరాజుగారుఅమలాపురం పట్టణం, సామర్లకోట, పెద్దాపురం సమితులు పర్యటించిరి. ఉపాధ్యాయులలో అపూర్వ ఆదరణ కానవచ్చింది.

## రాజోలు సమితి మేనేజిమెంటు వాగ్దాన భంగం

రాజోలు సమితిలో చిరకాలంగాయున్న అపరిష్కృత సమస్యలపై సమితి, ఉపాధ్యాయ సంఘాలు సంయుక్తంగా డిశంబరు 77 లో ధర్నా కార్యక్రమం జరిపి, నిరాహారదీక్షలు కొనసాగించుటకు పూనుకొనగా ఆనాటి స్పెషల్ ఆఫీసర్ కలుగజేసుకొని ఈ క్రింది హామీలు యివ్వటం జరిగింది.

సీనియారిటిని అమలు చేస్తానని, భార్య భర్తలు ఒకేచోట

వియమిస్తాదని, గతంలో జరిగిన అక్రమ బదిలీలను సరిచేస్తానని 1 వ తేదీకి జీతాలు యిస్తామని, 50% నాన్ పి. యఫ్ వడ్డీ టీచర్లకు యిస్తానని, లోగడ హామీలు యిచ్చారు. కాని వాటిని పూర్తిచేయటం జరుగలేదు. ఒకేనెలలో రెండు, మూడు రోజులు జీతాలకు త్రిప్పటమేగాక ఒక టి. ఎ. మాత్రమే యివ్వడం జరుగుతున్నది. సమితి ఆదేశాలకై పుస్తకాలు వగైరాలకు ఆఫీసుకు వెళ్ళినా టి.ఎ.డి ఎ. లు యివ్వటంలేదు. కాన పై సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అట్లు పరిష్కరించని పక్షంలో ప్రత్యక్ష చర్యకు పూనుకోవలసి వస్తుందని సమితి యు. టి. యఫ్ శాఖ డిమాండు చేస్తున్నది.

## "మెట్టు" సెంటరుశాఖ నూతన ప్రారంభోత్సవము

నెల్లూరుజిల్లా, కోటసమితిలోని "మెట్టు" ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణములో అత్యుత్సాహవాతావరణంలో యు.టి.ఎఫ్. మెట్టు నూతన సెంటరుశాఖ, టి.ఎ. సెంటరుశాఖలు తేది 15-7-78 ఏర్పడినవి. సభకు కోటసమితిశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ షేక్ సాబ్జాన్‌గారు అధ్యక్షత వహించిరి. 100% ఉపాధ్యాయులు యు.టి.ఎఫ్. సభ్యులుగా చేరిరి.

